## ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు ముగిసిన గడువు

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఓటర్ల నమోదు బుధవారంతో ముగిసింది. చివరిరోజు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ రెండింటిలో కలిపి మూడువేల దరఖాస్తులు వచ్చాయి. దీంతో మొత్తం దరఖాస్తులు 10,777కు చేరాయి. అయితే దరఖాస్తులపై ఒకటి, రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈనెల 23వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేయనున్నారు. అదేరోజు నుంచి మరోసారి ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించారు.

# ట్రాఫికర్‌కు చెక్

## సమస్య పరిష్కారానికి మాస్టర్‌ప్లాన్

- నగరంలోని ట్రాఫిక్‌ను అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారికి మళ్లించేలా వ్యూహం
- అనకాపల్లి నుంచి భోగాపురం వరకూ 15 అంతర్గత రోడ్లు అభివృద్ధి
- రూ.404 కోట్లు ఖర్చవుతుందని అంచనా
- జీవీఎంసీ, వీఎంఆర్‌డీ, రోడ్లు భవనాల శాఖ ద్వారా నిధులు సర్దుబాటు
- భోగాపురం విమానాశ్రయం ప్రారంభమయ్యేలోగా విస్తరించిన రోడ్లను అందుబాటులోకి తేవాలని లక్ష్యం
- డీపీఆర్ తయారీకి టెండర్ పిలిచేందుకు వీఎంఆర్‌డీఏ కసరత్తు



జాతీయ రహదారిని కలిపేలా ప్రతిపాదించిన అంతర్గత రోడ్లు (మ్యాప్)

**జాతీయ రహదారిని అనుసంధానిస్తూ అభివృద్ధి చేయనున్న రోడ్లు**

- శివశక్తినగర్-హరిత ప్రాజెక్టు
- బోయపాలెం జంక్షన్-మంగమారిపేట
- పరదేశిపాలెం-గంభీరం
- దొరతోట జంక్షన్-కుమ్మరిపాలెం
- మూలకుద్దు-నేరెళ్లవలస
- నేరెళ్లవలస-తాళ్లవలస
- గండిగుండం-కొత్తవలస
- తగరపువలస-మూలకుద్దు
- చిప్పాడ-దివీస్ రోడ్డు
- బొడ్డవలస-విజయనగరం
- మోపాడ-సవరవిల్లి
- అడవివరం-గండిగుండం
- పినగాడి-వేపగుంట
- వేపగుంట-జుత్తాడ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

**నగరంలో రోజురోజుకీ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. భోగాపురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ మరింత పెరిగే అవకాశం ఉన్నందున ఇప్పటినుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ, వీఎంఆర్‌డీ అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో నగరం మీదుగా వెళుతున్న వాహనాలను ఎక్కడికక్కడ కొత్తగా నిర్మించిన జాతీయ రహదారిపైకి మళ్లించడం ద్వారా ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టవచ్చునని అధికారులు గుర్తించారు. అందుకోసం తయారుచేసిన మాస్టర్‌ప్లాన్‌ను ఇటీవల నగర పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణలకు అందజేశారు. వారు సంతృప్తి వ్యక్తంచేయడంతో వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో డీపీఆర్ తయారీకి టెండర్లు పిలిచేందుకు కసరత్తు ప్రారంభించారు.**

నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతుండడంతో ట్రాఫిక్ కూడా అదేస్థాయిలో పెరుగుతోంది. ప్రస్తుతం సగటున రోజుకు 12 లక్షల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ అయిపోతోంది. లంకెలపాలెం నుంచి ఆనందపురం వరకూ ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ కూడళ్ల వద్ద వందలాది వాహనాలు బారులు తీరుతుంటాయి. ఇదిలావుండగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని 2026 జూన్ నాటికి అందుబాటులోకి తెస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. భోగాపురం విమానాశ్రయం ప్రారంభమైతే ట్రాఫిక్ మరింతగా పెరగడం ఖాయమని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదే విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి జీవీఎంసీ, పోలీస్ అధికారులు కొన్నాళ్ల కిందట తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన భవిష్యత్తు ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే కార్యాచరణ అమలు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టంచేశారు. నగరంలోని ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడంతోపాటు, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లి వచ్చే ప్రయాణికులకు కూడా సమస్య లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించి తనకు నివేదించాలని సూచించారు. దీనిపై వీఎంఆర్‌డీ, జీవీఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. అనకాపల్లి నుంచి ఆనందపురం మీదుగా శ్రీకాకుళం వైపు వెళ్లే జాతీయ రహదారికి ఎక్కడికక్కడ అనుసంధాన రోడ్లను అభివృద్ధి చేస్తే ట్రాఫిక్ సమస్యకు అడ్డుకట్టపడుతుందని గుర్తించారు. ఈ మేరకు ఒక మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించి ఇటీవల నగరానికి వచ్చిన సీఎం చంద్రబాబునాయుడుకు అందజేశారు. మాస్టర్‌ప్లాన్‌ను పరిశీలించిన సీఎం చంద్రబాబునాయుడు దీనిపై తదుపరి చర్యలు తీసుకోవాలంటూ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణకు సూచించారు. దీంతో ఆయన వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ అధికారులతో సమీక్ష నిర్వహించి తగిన ఆదేశాలు జారీచేశారు.

### జాతీయ రహదారికి అనుసంధానం కోసం రూ.404 కోట్లతో 15 రోడ్లు అభివృద్ధి

ప్రస్తుతం విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి ప్రయాణించే వారిలో 65 శాతం మంది జీవీఎంసీ పరిధిలోని ప్రాంతాలకు చెందినవారుండగా, విజయనగరం వైపు నుంచి వచ్చేవారు 14 శాతం, శ్రీకాకుళం వైపు నుంచి 12 శాతం, అనకాపల్లి వైపు నుంచి తొమ్మిది శాతం మంది వస్తున్నట్టు అధికారులు ... మిగతా 6వ పేజీలో

# ఎన్ఐఓ పనుల్లో కదలిక

**జాతీయ సముద్ర శాస్త్ర అధ్యయన సంస్థ భవన నిర్మాణానికి తొమ్మిదేళ్ల కిందట రుషికొండ వద్ద శంకుస్థాపన**



కొండపై పనులు

- రకరకాల సమస్యలతో ముందుకుసాగని పనులు
- అన్నింటినీ అధిగమించి ఇప్పుడు మొదలెట్టిన అధికారులు
- సముద్ర నీటిమట్టం పెరుగుదల, కాలుష్యం హెచ్చుతగ్గులు, అంతర్భాగంలో జరిగే మార్పులపై సంస్థ అధ్యయనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

**విశాఖపట్నంలో తొమ్మిదేళ్ల క్రితం శంకుస్థాపన జరిగిన జాతీయ సముద్ర శాస్త్ర అధ్యయన సంస్థ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ-ఎన్ఐఓ) కార్యాలయ భవన నిర్మాణ పనులు ఇప్పుడు మొదలయ్యాయి. తూర్పు తీరంలో సముద్ర తీరాన మంజూరైన ఏకైక అధ్యయన సంస్థ ఇదే కావడం గమనార్హం. ఎన్ఐఓ సముద్రంలో వచ్చే మార్పులను గమనిస్తూ, పరిశోధనలు చేస్తూ ముందస్తు సమాచారాన్ని ప్రభుత్వాలకు అందిస్తుంది. దీని ప్రధాన కార్యాలయం గోవాలో ఉండగా ప్రాంతీయ కేంద్రాలు ముంబై, కొచ్చిన్, విశాఖపట్నంలలో ఉన్నాయి.**

విశాఖలో ఎన్ఐవో కార్యాలయం కొన్ని దశాబ్దాలుగా అద్దె భవనంలో నడుస్తోంది. దాంతో దానిని విస్తరించే అవకాశం లేకుండా పోయింది. ఈ సమస్య పరిష్కారం కోసం సాగర తీరాన సొంత భవనం నిర్మించి, పరిశోధనలు విస్తృతం చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు రుషికొండలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి 3.25 ఎకరాలు తీసుకుంది. 2015 జనవరి 31నకేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిగా పనిచేసిన సుజనాచౌదరి ఎన్ఐఓ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ తరువాత అనేక అనుమతులు అవసరమయ్యాయి. అడ్డంకులు ఎదురయ్యాయి. దాంతో పనులు ముందుకు కదల్లేదు. ఇది తీర ప్రాంతంలో ఉండడంతో కోస్తా నియంత్రణ మండలి అనుమతులు తీసుకోవలసి వచ్చింది. భూ వివాదం కూడా కొన్నాళ్లు నడిచింది. ఎట్టకేలకు అన్ని అడ్డంకులు తొలగిపోవడంతో వారం క్రితం రుషికొండలో బే పార్క్ పక్కనే రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

### రూ.30 కోట్లతో మూడు బ్లాకులు

ఎన్ఐఓ భవన సముదాయానికి కేంద్ర ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరుచేసింది. నిర్మాణ పర్యవేక్షణ పనులు సీపీడబ్ల్యుడీకి అప్పగించింది. కోల్‌కతా కాంట్రాక్టర్ పనులు చేస్తున్నారు. మూడు ... మిగతా 6వ పేజీలో

## ఉజ్బెకిస్తాన్‌లో గాజువాక వాసి మృతి

**మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న కుటుంబీకులు**



కొప్పనాతి ఆనంద్ (ఫైల్ ఫొటో)

గాజువాక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం ఉజ్బెకిస్తాన్ వెళ్లిన గాజువాక వాసి అక్కడ అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఇందుకు సంబంధించి ఆయన కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని న్యూపోర్టు పోలీస్ స్టేషన్ పరిధి యాతపాలెం ప్రాంతానికి చెందిన కొప్పనాతి ఆనంద్ (43) వెల్డర్. ఉపాధి నిమిత్తం గాజువాక ఆటోనగర్‌లో గల ఓ ప్రైవేటు ఏజెన్సీ ద్వారా ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీన ఉజ్బెకిస్తాన్ వెళ్లారు. ఈ నెల రెండో తేదీ రాత్రి పది గంటలకు ఫోన్‌లో కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మరుసటిరోజు (నవంబరు 3న) ఉదయం అక్కడ నుంచి ఒకరు ఆనంద్ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి అతను చనిపోయినట్టు చెప్పారు. దీంతో వారు అక్కడ ఆనంద్ పనిచేస్తున్న సంస్థ అధికారులను ఫోన్‌లో సంప్రతించేందుకు యత్నించగా స్పందించలేదు. గాజువాకలో గల ఏజెన్సీ ప్రతినిధులు కూడా తమకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని ఆనంద్ కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఆనంద్ ఎలా చనిపోయాడో తెలియడం లేదని, తమకు పలు అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు బుధవారం న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై న్యూపోర్టు సీఐ దాలిబాబును సంప్రతించగా సంబంధిత ఏజెన్సీ ప్రతినిధితో మాట్లాడామన్నారు. మృతదేహం రహదారిపై ఉందని, రోడ్డు ప్రమాదం అయి ఉండవచ్చునని సమాచారం ఉందన్నారు. అక్కడ పోలీసుల దర్యాప్తులో వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు. ఆనంద్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## జాబ్ స్కామ్ కేసులో మల్కాపురం వాసి అరెస్టు

ఎండాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కంబోడియా, మయన్మార్, బ్యాంకాక్ తదితర ప్రాంతాల్లో ఉద్యోగాల పేరిట భారతీయులను మోసం చేస్తున్న విశాఖ నగరంలోని మల్కాపురానికి చెందిన దాసరి వెంకటరాఘవపార్థసారధిని సైబర్ క్రైమ్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి కీలక సమాచారాన్ని రాబట్టారు. వారు అందించిన వివరాల ప్రకారం...వెంకటరాఘవపార్థసారధి గతంలో పలు దేశాల్లో వెల్డింగ్ పనులు చేసేవాడు. కొద్దికాలం తరువాత తిరిగి ఇండియాకు వచ్చేశాడు. అతడికి చుక్క రమేష్ అనే వ్యక్తితో ... మిగతా 6వ పేజీలో

# ఉక్కుపై ద్వంద్వ వైఖరి

**గోరంత సాయం... కొండంత ప్రచారం**

- ఉత్పత్తికి అవసరమైన మేర ముడి పదార్థాలు సమకూర్చకుండా లాభాల్లోకి తేవాలంటూ ఆదేశాలు
- జీతాలు, పెన్షన్లు ఇవ్వకుండా వేధింపులు
- అదేమని ప్రశ్నిస్తే చర్యలు తీసుకుంటామంటూ బెదిరింపులు
- ఇన్‌చార్జి సీఎండీని మార్చాలంటున్న ఉద్యోగులు, కార్మికులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

**విశాఖపట్నం స్టీల్ ప్లాంటు కష్టాలు ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. కేంద్రంలోని పాలకులు ప్లాంటును ప్రైవేటీకరణ చేయబోమని చెబుతున్నారే తప్ప ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. పూర్తిస్థాయి ఉత్పత్తికి అవసరమైన సహకారం అందించడం లేదు. ఉద్యోగులను భారీసంఖ్యలో తగ్గించేస్తూ సెయిల్‌మాదిరిగా లాభాలు తేవడానికి కృషిచేయాలని సూక్తులు చెబుతున్నారు.**

ఉక్కు ఉద్యోగులకు గత రెండు నెలల నుంచి సగం జీతమే ఇస్తున్నారు. మిగిలిన 50 శాతం జీతం గురించి మాట్లాడడం లేదు. 850 కుటుంబాలకు నాలుగు నెలలుగా పెన్షన్లు ఇవ్వడం లేదు. పండుగ సమయంలో కూడా జీతాలు ఇవ్వరా?...అని ఉద్యోగులు ధర్నా చేస్తే వారికి నోటీసులు ఇస్తున్నారు. విధి నిర్వహణలో ఉన్న సమయంలో ధర్నాలు చేయడానికి వీల్లేదని, ఇంకోసారి అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఉద్యమాలు నడుపుతున్న నాయకులను కట్టడి చేయడానికి బదిలీ అస్త్రం చూపించి బెదిరిస్తున్నారు. గతంలో మూడో బ్లాస్ట్ ఫర్నేస్ మూతపడడానికి కారణమైన అధికారికి ఇన్‌చార్జి సీఎండీ బాధ్యతలు అప్పగించారని, ఆయన వచ్చిన తరువాత సమస్యలు మరింత పెరిగాయని ఉద్యోగులు, కార్మికులు ఆరోపిస్తున్నారు.

### రూ.1,650 కోట్ల సాయంతో సరా?

ఏడాదికి 7.3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి చేయగల స్టీల్ ప్లాంటుకు ముడి పదార్థాల కొరత తీవ్రంగా ఉంది. రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు మూతపడి, మిగిలిన ఒకటి అరకొరగా నడుస్తుండగా సెప్టెంబరు నెలలో కేంద్రం రూ.1,650 కోట్లు రెండు విడతలుగా సాయం చేసింది. మొదట రూ.500 కోట్లు వచ్చి, ఆ మొత్తాన్ని జీఎస్‌టీ, తదితర పన్నులు కట్టడానికి ... మిగతా 6వ పేజీలో

## ఉక్కు కాంట్రాక్టు కార్మికుల అవస్థలు

**కొంతమందికి ఆరేడు నెలలుగా అందని జీతాలు**

- యాజమాన్యం ఇచ్చినప్పుడు ఇస్తాం... నచ్చితే చెయ్యండి లేదా మానేయండంటున్న కాంట్రాక్టర్లు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. 'యాజమాన్యం బిల్లులు ఇస్తేనే జీతాలు ఇస్తాం. నచ్చితే పనిచేయండి లేదంటే మానేయండి' అని కాంట్రాక్టర్లు తెగేసి చెబుతున్నారని కార్మి కులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులకు జీతాలు సకాలంలో అందడం లేదు. కొన్ని విభాగాల్లో అయితే ఆరేడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. సంబంధిత కాంట్రక్టర్లు పని ప్రదేశానికి రావడం లేదని, ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదని కార్మికులు చెబుతున్నారు. జీతాల విషయం అధికారులను అడిగినప్పటికీ సరైన సమాధానం చెప్పడం లేదని, బిల్లులు పెట్టామని, యాజమాన్యం ఇస్తే చెల్లింపులు జరుగుతాయని చెబుతున్నారన్నారు. డబ్బుల్లేక పండుగలు కూడా జరుపుకోలేని పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు. ప్రస్తుతం ప్లాంటులో ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నా యి. ఈ సమయంలో పనులకు వెళ్లకపోతే తరువాత పని ఉంటుందో లేదోనన్న ఆందోళనలో కార్మికులు ఉన్నారు. జీతం అందకపోయినా ఉన్న పని మానలేక, ఇతర పనులకు వెళ్లలేక ఏం చేయాలో అర్థంకాని పరిస్థితిలో కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు.

# దీపం లబ్ధిదారులకు గ్యాస్ డబ్బులు

**ఖాతాలకు రూ.807.05 జమ**

- ఎవరికైనా సబ్సిడీ సొమ్ము అందకుంటే ఏజెన్సీల వద్దకు వెళ్లి ఈకేవైసీ చేసుకోవాల్సిందిగా అధికారుల సూచన
- ఇప్పటివరకూ సిలిండర్ బుక్ చేసుకున్నవారు 1,04,309 మంది
- 59,275 మందికి డెలివరీ



ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీని డీఎస్‌వోకు తన సెల్‌లో చూపిస్తున్న మహిళ

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):

**దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు తీసుకున్న లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు జమ అవుతున్నాయి. ఈ మేరకు వినియోగదారులకు మెసేజీలు వస్తున్నాయి. నగరంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.811. అందులో కేంద్ర ప్రభుత్వం రూ.3.95 సబ్సిడీ ఇస్తోంది. మిగిలిన రూ.807.05 పైసలు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. ఈ సొమ్మును ఆయిల్ కంపెనీలకు ప్రభుత్వం ముందుగానే జమ చేసింది.**

గత నెల 29వ తేదీ నుంచి గ్యాస్ సిలిండర్లు బుకింగ్ ప్రారంభం కాగా 31వ తేదీ నుంచి డెలివరీ మొదలెట్టారు. సిలిండర్ తీసుకున్న 48 గంటల్లో లబ్ధిదారుని ఖాతాకు రూ.3.95 మినహాయించి మిగిలిన రూ.807.05 జమ చేయనున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. దీనికి అనుగుణంగా జిల్లాలో సిలిండర్లు డెలివరీ అయిన వారికి రెండు రోజుల నుంచి సొమ్ములు జమ అవుతున్నాయి. అల్లిపురం ప్రాంతంలో సిలిండర్లు తీసుకున్న పలువురి ఇళ్లకు బుధవారం జిల్లా పౌర సరఫరాల అధికారి భాస్కరరావు వెళ్లి సొమ్ము జమ అయిందా?, లేదా? అని ఆరా తీశారు. రెండు రోజుల క్రితమే సొమ్ము జమ అయిందని కొందరు, బుధవారం వచ్చిందని మరికొందరు చెప్పారు. గత నెల 29వ తేదీ నుంచి ఈనెల నాలుగో తేదీ వరకు జిల్లాలో మూడు ప్రధాన గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 1,04,309 మంది సిలిండర్ బుక్ చేసుకోగా, వారిలో ... మిగతా 6వ పేజీలో

## తాగునీటి సరఫరాకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తగరపువలస, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస, చిట్టివలస ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు తక్షణమే చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. చిట్టివలసలో తాగునీటి సమస్యపై 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం వచ్చిన వార్తకు ఆయన స్పందించారు. ప్రస్తుతం కొండపేట వద్ద ఉన్న గోస్తనీ నదిలో ఇన్‌ఫిల్టర్ బావులు పని చేయడం లేదని, నగరపాలెంలో 4, సామేయవలసలో 6 ఇన్‌ఫిల్టర్ బావుల ద్వారా నీటి సరఫరా జరుగుతుందన్నారు. జీవీఎంసీ పరిధిలో సుమారు 7500 కుళాయి కనెక్షన్లు ఉన్నాయని, బావుల్లో నీరు ఉప్పుగా ఉండడంతో చాలామంది వీటిపై ఆధారపడుతున్నారని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో 45 నిమిషాలు, మరికొన్ని ప్రాంతాల్లో 35 నిమిషాల పాటు కుళాయిల ద్వారా నీటిని అందిస్తున్నామన్నారు. చిట్టివలసలోని రెల్లివీధికి ట్యాంకరు ద్వారా నీరు సరఫరా చేస్తున్నామని, ఈ ప్రాంతానికి వెళ్లడానికి రోడ్డు సరిగ్గా లేదన్నారు. ఇకపై ఆ ప్రాంతంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## నిబంధనలకు వ్యతిరేకంగా కారు పార్కింగ్



ప్రధాన రాజగోపురం వద్ద నిలిపిన కారు

సింహాచలం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులు తమ వాహనాలను నిర్దీత స్థలాల్లో పార్క్ చేయాలని ఈవో ఆదేశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు, మంత్రి నారా లోకేశ్ తదితర ప్రముఖులు తమ వాహనాలను దేవస్థానం నిర్ణయించిన పార్కింగ్ స్థలంలో ఉంచి స్వామి దర్శనానికి నడిచివచ్చారు. కానీ కొందరు ఆలయ సిబ్బంది ఇష్టానుసారం తమ వాహనాలనే కాకుండా పరిచయం ఉన్న వారి వాహనాలను ప్రధాన రాజగోపురానికి చేరువగా పార్క్ చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం కొత్తకారు కొన్న భక్తుడు వాహన పూజకు గోకులం వద్దకు తేవాల్సి ఉండగా ప్రధాన రాజగోపురం వద్ద నున్న లిఫ్ట్‌వరకు తెచ్చి పార్క్ చేశాడు. అయినా విధుల్లోని గార్డులు ప్రశ్నించకపోవడంపై భక్తులు మండిపడుతున్నారు. ఈ వ్యవహారంలో ఈవో తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పుస్తెలతాడు అపహరణ

పద్మనాభం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అనంతవరం గ్రామంలో మహిళ మెడలో ఉన్న మూడు తులాల పుస్తెల తాడును ఇద్దరు ఆగంతకులు దోచుకెళ్లారు. పోలీసుల వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన కె. పార్వతి (50) పొలంలో పశువులకు గడ్డి కోసుకుంటుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమెను మాటల్లో పెట్టి మెడలో ఉన్న పుస్తెల తాడుతో పాటు చెవికి ఉన్న దిద్దులను బలవంతంగా లాక్కొని వెళ్లిపోయారు. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో ఆమె వారిని ఎదుర్కొలేకపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ సీహెచ్ శ్రీధర్ ఆధ్వర్యంలో క్రైం ఏఎస్‌ఐ శర్మ, కానిస్టేబుల్ నవీన్ ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

## రూ. 3 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు చోరీ

ఎండాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బంగారం, వెండి, నగదు చోరీకి గురైందని పీఎంపాలెం స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మల్కాపురంలోని జనతా కాలనీలో నివాసం ఉంటున్న కోసూరి రామలక్ష్మీ (64) పీఎంపాలెం స్టేడియం ప్రాంతంలోని అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న తన కొడుకు ఇంటికి రావడానికి సూట్ కేసుతో ఈనెల 4న మల్కాపురం నుంచి ఆటోలో ప్రయాణించి పాత గాజువాక చేరుకుంది. అక్కడ నుంచి 411 ఆర్టీసీ బస్సులో పీఎంపాలెం స్టేడియం వద్దకు చేరుకుంది. కొడుకు ఇంటికి వచ్చి సూట్ కేసులోని బంగారు ఆభరణాలు పెట్టె కోసం వెతగ్గా కనిపించలేదు. పెట్టెలో సుమారు పన్నెండున్నర తులాల బంగారు ఆభరణాలు, ఐదు తులాల వెండి వస్తువులు, ఐదు వేల రూపాయల నగదు ఉన్నాయని బాధితురాలు తెలిపారు. ఆటోలో వస్తున్నప్పుడు వెనుక ఒక మహిళ ఉందని ఆమె చోరీకి పాల్పడి ఉంటుందని భావిస్తున్నారు. పీఎంపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మురుగు నీటి ప్రవాహానికి ఇబ్బందులు



తగరపువలస, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సంగివలస ప్రాంతంలో ఇటీవల నిర్మించిన పలు అపార్టుమెంట్ల వద్ద వాడుక నీరు ప్రవహించడానికి ఎటువంటి ఏర్పాట్లు చేయకపోవడంతో పరిసర ప్రాంతాలు దుర్గంధభరితంగా తయారవుతున్నాయి. రెండు రోజుల క్రితం ఒక అపార్టుమెంటుకు చెందిన డ్రైనేజీ కుండీ పగిలిపోవడంతో విపరీతమైన దుర్వాసన వస్తోంది. ఈ డ్రైనేజీ నీరు మురుగు కాలువల్లో కలుస్తుండడంతో పరిసర ప్రాంతాలకు దుర్వాసన వ్యాపిస్తోంది. ఈ విషయమై స్థానికులు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ పరిధిలో ఉన్న అన్ని అపార్టుమెంట్ల వద్ద ఇదే పరిస్థితి ఉందని వారు తెలిపారు. ఈ ప్రాంతంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు, డ్రైనేజీ కుండీలకు శుభ్రం చేయాలని పలువురు కోరుతున్నారు.

# ఆక్రమణలో టిడ్కో స్థలం

» రేకులు వేసి, నిర్మాణాలు » అధికారులకు స్థానికుల ఫిర్యాదు



టిడ్కో గృహాలకు అనుకొని నిర్మించిన రేకుల షెడ్

మధురవాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డులోని సుద్దగెడ్డ సమీపంలో నిర్మించిన టిడ్కో గృహాల వద్ద ఆక్రమణల పర్వం మొదలైంది. ఇక్కడ సుమారు 1400 గృహాలను బహుళ అంతస్థుల తరహాలో నిర్మించి, ఇటీవల లబ్ధిదారులకు అందించారు. ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో కొందరు అనధికారికంగా రేకుల షెడ్లు వేస్తున్నారు. వీటిని భవిష్యత్తులో అద్దెకు ఇవ్వడానికి నిర్మించినట్టు తెలిసింది. సాధారణంగా ప్రభుత్వం నిర్మించే గృహ సముదాయాల మధ్యన ఖాళీ స్థలాలను విడిచిపెడతారు. అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు అగ్నిమాపక శకటాలు వెళ్లడానికి వీలుగా ఈ స్థలం ఉపయోగపడుతుంది. అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. కానీ కొందరు స్థలాన్ని ఆక్రమించి, షెడ్లు వేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి షెడ్లు తొలగించి, స్థలం ఆక్రమణకు గురవ్వకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## ముగిసిన తిరు నక్షత్ర పూజలు



సింహాచలం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విశిష్టాద్వైత మతవ్యాపకులు మనవాళ మహామునుల తిరునక్షత్ర పూజలు బుధవారం జరిగిన చాత్తుతో పరిసమాప్తమయ్యాయి. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనల తరువాత బాలభోగనివేదనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులు, ఆళ్వార్ల మూర్తులను ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. లోకకల్యాణార్థం అన్న సంకల్పంతో షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నాలుగు రోజులుగా సాగుతున్న నాలాయిర దివ్యప్రబంధంలోని మిగిలిన పాశురాలను ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ సారధ్యంలో వైదికులు పారాయణలు పూర్తిచేశారు. మధ్యాహ్నం రాజభోగ నివేదన సమయంలో ప్రత్యేక పూజలు చేసి తీర్థగోష్ఠి జరిపి ప్రసాద వితరణ జరపటంతో తిరునక్షత్ర పూజలు పూర్తయ్యాయి.

## కాలువ ఎత్తు తగ్గించాలని వినతి

ఆనందపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దిపాలెం జాతీయ రహదారిపై కాలువ ఎత్తు తగ్గించాలని గ్రామస్తులు నేషనల్ హైవే అధికారులకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారికి అనుకుని ఉన్న నివాసితులు హైవే ఏర్పాటు సమయంలో స్వచ్ఛందంగా స్థలాలు ఇచ్చారన్నారు. హైవే ఏర్పాటు చేసి సర్వీసు రోడ్డు వేస్తున్నప్పుడు గ్రామానికి వెళ్లడానికి రహదారి లేకుండా కాలువ ఎత్తు పెంచడం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. ఈ విషయమై అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా... పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కాలువ ఎత్తు తగ్గించి సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై హైవే అధికారులు సానుకూలంగా స్పందించినట్టు గ్రామస్తులు చెప్పారు.

## సీసీ రోడ్లు, కాలువల పనులు పరిశీలన

సింహాచలం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ పీవీ నరసింహం కాంట్రాక్టర్లను ఆదేశించారు. బుధవారం ఆయన పాత అడివివరంలో రూ.18.64 లక్షల జీవీఎంసీ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్లు, కాలువల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల అవసరాలకు తగ్గట్టుగా వార్డులో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

## ఘనంగా కార్తీక దీపోత్సవం



ప్రవచనం వినిపిస్తున్న భక్తదాస

మధురవాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : క్రికెట్ స్టేడియం ఎదురుగా ఉన్న ఎంవీవీ సిటీలో హరేకృష్ణ మూవ్‌మెంట్, ఎంవీవీ సిటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కార్తీక దీపోత్సవం ఘనంగా జరిగింది. వందల మంది భక్తులు కార్యక్రమంలో పాల్గొని, దీపారాధన చేశారు. సిటీ ఆవరణమంతా కార్తీక దీపాలతో దేదీప్యమానంగా వెలుగులు విరజిమ్మాయి. ఈ సందర్భంగా భక్తదాస చేసిన ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్తీకంలో దామోదరుడ్ని ఆరాధించడంతో పాటు నేతి దీపం వెలిగించడం వల్ల పుణ్యఫలం దక్కుతుందని భక్తదాస పేర్కొన్నారు. అనంతరం దామోదర అష్టకం, కీర్తనలు ఆలపించారు.

## జూనియర్ సివిల్ జడ్జిలకు శిక్షణ




శిక్షణలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆనందరావు

పద్మనాభం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా నియమితులైన జూనియర్ సివిల్ జడ్జిలకు తహసీల్దారు కె. ఆనందరావు బుధవారం శిక్షణ ఇచ్చారు. జ్యూడీషియల్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న వారికి క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులపై శిక్షణ కోసం పద్మనాభం మండలానికి పంపించారు. ఈమేరకు తహసీల్దారు రెడ్డిపల్లి సచివాలయానికి తీసుకువెళ్లి కార్యాలయంలో అందించే పలు సేవలతో పాటు రెవెన్యూ కార్యకలాపాలు గురించి వివరించారు. అలాగే తహసీల్దారు కార్యాలయంలో రికార్డు గది, రెవెన్యూ రికార్డులు తదితర వాటిపై కూడా అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయి పర్యటనకు తీసుకువెళ్లి భూముల రికార్డులపై వివరించారు.

## 11 నుంచి బాలల సైన్స్ కాంగ్రెస్

సాగర్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గీతం వర్సిటీ వేదికగా జవహర్ నవోదయ విద్యాలయ సమితి (జేఎన్‌వీ) ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 15 వరకు ప్రాంతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ నిర్వహించనున్నారు. దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి జవహర్ నవోదయ విద్యాలయాల విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఈమేరకు ప్రతిభ గల విద్యార్థులను జేఎన్‌వీ తరఫున ఎంపిక చేశారు. కాగా బాలల సైన్స్ కాంగ్రెస్ విజయవంతానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. వేదవతి తెలిపారు. శాస్త్ర విజ్ఞానంలో వస్తున్న మార్పులు, ఆసక్తికర పరిశోధనలపై ప్రసంగాలతో పాటు విద్యార్థులకు వర్సిటీలోని ప్రయోగశాలలను సందర్శించే అవకాశం కల్పిస్తున్నామని ఆమె తెలిపారు.

## వేతనాలు చెల్లించాలని వీఓఏల ఆందోళన



వెలుగు కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న వీఓఏలు

భీమునిపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వెలుగు కార్యాలయం ఎదుట విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వీఓఏ) బుధవారం ఆందోళన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీఓఏలు పార్వతి, వెంకటలక్ష్మి మాట్లాడుతూ రోజురోజుకి కొత్త కొత్త యాప్‌లతో పనిభారం పెంచుతూ ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. అయిదు నెలలు వేతనాలు మంజూరు చేయకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. చాలీచాలని వేతనాలు, పైగా బకాయిలు వుంటే ఎలా బతకాలని ప్రశ్నించారు. సీఐటీయూ భీమిలి నాయకుడు ఎస్. అప్పలనాయుడు మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి నాయకులు వీఓఏల కాలపరిమితి మూడేళ్లుగా వున్న సర్క్యులర్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు అదే సర్క్యులర్‌ను మళ్లీ జారీ చేయడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. సీఐటీయూ నాయకుడు రవ్వ నరసింగరావు మాట్లాడుతూ వీఓఏలకు కనీస వేతనాలు అమలు చేయాలని, రాజకీయ వేధింపులు లేకుండా చూడాలని, వర్క్ లోడ్ తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం వెలుగు అధికారులకు వినతిపత్రం అందించారు.

## అంధ బాలికలకు వైద్య పరీక్షలు



మాట్లాడుతున్న సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

సాగర్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) :సాగర్‌నగర్ బీచ్‌రోడ్డులో ఉన్న అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో బాలికలకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ పర్యవేక్షణలో డీఎంహెచ్‌ఓ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో వైద్యులు బాలికల నేత్రాలను పరీక్షించి, కొంతమందిని ప్రాంతీయ నేత్ర వైద్యశాలకు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కళ్యాణి, భరత్, పాఠశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్నను దర్శించుకున్న మహారాష్ట్ర ఉన్నతాధికారి

సింహాచలం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన విభాగం ఉన్నతాధికారి భాగ్యశ్రీ భనాయత్ వరాహలక్ష్మీనృసింహస్వామిని బుధవారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న తరువాత అంతరాలయంలో ఆమె పూజలు జరిపారు. గోదాదేవి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు ప్రసాదాలు అందజేశారు.

## ప్రముఖుల సేవల్లో దేవస్థానం అధికారులు



మాట్లాడుతున్న వీహెచ్‌పీ నేతలు

సింహాచలం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కొందరు అధికారులు నిబంధనలు పాటించకుండా పోలీసు అధికారిణికి పూజలు జరిపించిన ఘటనపై విచారణ జరపాలని వీహెచ్‌పీ నేత పూడిపెద్ది శర్మ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఈఓ త్రినాథరావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ దైవం ముందు అంతా సమానమే అన్న సత్యాన్ని విస్మరించి కొందరు అధికారులు ప్రముఖుల సేవల్లో తరిస్తున్నారని ఆరోపించారు. సింహగిరిపై వివాహం జరిపించుకోవడం సామాన్యులకు పెనుభారంగా మారిందని, షామియానాల వేలం రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా నేత మాధవీలత, తదితరులు పాల్గొన్నారు.

# ఆదాయం పెంపునకు ప్రణాళికలు

ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు



సమావేశంలో మాట్లాడుతున్న వజ్జ బాబూరావు

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆదాయం పెంపునకు పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు తెలిపారు. పిఠాపురం కాలనీ జనశిక్షణ సంస్థాన్ భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం నుంచి నిధులు తెచ్చుకోవడంతో పాటు తమ సంస్థకున్న ఆస్తులు, వ్యాపారాల ద్వారా ఆదాయం వృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కార్పొరేషన్‌కు ఆస్తులు ఉండేవని, విభజన తర్వాత సంస్థ కార్యకలాపాలు తగ్గాయన్నారు. ప్రస్తుతం కార్పొరేషన్‌కు రాష్ట్రంలో ఉన్న ఆస్తులు పరిశీలిస్తున్నామన్నారు. కార్పొరేషన్‌కు రాష్ట్ర బడ్జెట్ ఉండదని, కేంద్రమే నిధులు కేటాయించాల్సి ఉంటుందన్నారు. నగరంలోని నగరంలో రేసపువానిపాలెంలో 2.5 ఎకరాలను స్పెన్సర్ సంస్థ లీజుకు తీసుకుందని, గాజువాకలో 3.5 ఎకరాల్లో ఎగుమతి గిడ్డంగి ఉందన్నారు. అమరావతి, విశాఖ, తిరుపతి నగరాల్లో కన్వెషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఆరు నెలలకోసారి ట్రేడర్స్‌కు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. సంస్థలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి కృషి చేస్తామన్నారు. కార్పొరేషన్ జనరల్ మేనేజర్ హనుమా నాయక్ మాట్లాడుతూ సంస్థ ద్వారా లేపాక్షి, నంది బ్రాండ్ పేరుతో నోటు పుస్తకాలు విక్రయిస్తున్నామన్నారు. ప్రభుత్వ శాఖలకు సిమెంట్ సరఫరా చేస్తున్నామని చెప్పారు.

# ట్రా'ఫికర్'కు చెక్!

... 5వ పేజీ తరువాయి

గుర్తించారు. ప్రస్తుతం ఉన్న ఎయిర్‌పోర్టు నుంచి కొత్తగా నిర్మిస్తున్న భోగాపురం ఎయిర్‌పోర్టుకు కారులో వెళ్లడానికి అధికారులకే 1.15 గంటలు సమయం పట్టింది. అదే అనకాపల్లి నుంచి వచ్చేవారికి 2.30 గంటలు పట్టే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. దీనివల్ల ప్రయాణికులు ఎయిర్‌పోర్టుకు వెళ్లడానికి ఇబ్బందిపడే అవకాశం ఉంటుంది. కాబట్టి, అనకాపల్లి నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకూ ఎక్కడికక్కడ జాతీయ రహదారిని అనుసంధానం చేసేలా 15 రోడ్లను అభివృద్ధి చేయడం ద్వారా సమస్యకు చెక్ పెట్టవచ్చునని అధికారులు గుర్తించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొమ్మాదిలోని శివశక్తినగర్ నుంచి హరిత ప్రాజెక్టు రోడ్డు, బోయపాలెం జంక్షన్ నుంచి మంగమారిపేట, పరదేశిపాలెం జంక్షన్ నుంచి గంభీరం, దొరతోట జంక్షన్-కుమ్మరిపాలెం, మూలకుద్దు-నేరెళ్లవలస, నేరెళ్లవలస-తాళ్లవలస, గండిగుండం-కొత్తవలస, తగరపువలస-మూలకుద్దు, చిప్పాడ-దివీస్ రోడ్డు, బొడ్డవలస-విజయనగరం, మోపాడ-సవరవిల్లి, అడవివరం-గండిగుండం, పినగాడి-వేపగుంట, వేపగుంట-జుత్తాడ రోడ్లను బాగా విస్తరించేలా మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించారు. జీవీఎంసీ పరిధిలో రోడ్ల విస్తరణకు తీసుకునే భూమికి టీడీఆర్ జారీచేసేలా, అనకాపల్లి, విశాఖ, విజయనగరం జిల్లాల పరిధిలోని రోడ్ల విస్తరణకు తీసుకునే భూమికి యజమానులకు పరిహారం అందించాలని అధికారులు మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచారు. విస్తరించాలని ప్రతిపాదించిన 15 రోడ్ల నిర్మాణానికి రూ.404 కోట్లు అవసరం అవుతుందని అధికారులు అంచనా వేశారు. అందులో రూ.220 కోట్లు వీఎంఆర్‌డీ, రూ.120 కోట్లు జీవీఎంసీ, 64 కోట్లు రోడ్లు, భవనాల శాఖ భరించాల్సి ఉంటుంది.ఎక్కడికక్కడ వాహనాల మళ్లింపునకు అవకాశం అనకాపల్లి నుంచి భోగాపురం వరకూ జాతీయరహదారిని అనుసంధానిస్తూ కొత్తగా రోడ్లను అందుబాటులోకి తేవడం వల్ల ట్రాఫిక్‌ను నగరం నుంచి జాతీయ రహదారిపైకి, జాతీయ రహదారి నుంచి నగరంలోకి సులభంగా మళ్లించేందుకు వీలు కలుగుతుంది. నగరంలోకి ప్రస్తుతం భారీ వాహనాలు, గూడ్సు వాహనాలు ప్రవేశించడం వల్ల తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది.

అదే నగరం నుంచి ఎక్కడికక్కడ జాతీయ రహదారిని అనుసంధానించే రోడ్లు అందుబాటులోకి వస్తే సమీప ప్రాంతంలో బయలుదేరే వాహనాలు అనుసంధాన రోడ్ల మీదుగా జాతీయరహదారిపైకి వెళ్లిపోతాయి. దీని వల్ల నగరంలో ట్రాఫిక్ తగ్గుతుదని అధికారులు భావిస్తున్నారు. అలాగే అనకాపల్లి, గాజువాక ప్రాంతాల నుంచి భోగాపురం వెళ్లాలనుకుంటే జాతీయ రహదారి మీదుగా వెళ్లిపోతారు కాబట్టి అటువైపు నుంచి వచ్చే ట్రాఫిక్ నగరంలో తగ్గిపోతోంది. మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా రోడ్ల నిర్మాణం, విస్తరణకు వీలుగా డీపీఆర్ తయారుచేసేందుకు వీఎంఆర్‌డీఏ ద్వారా టెండర్లు పిలవాలని మంత్రి నారాయణ ఆదేశించడంతో అధికారులు ఆ దిశగా కసరత్తు ప్రారంభించారు.

## విద్యార్థుల ఫీజు చెల్లింపునకు ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న శ్రీరామ్

భీమునిపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పేద విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లింపునకు కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ శ్రీరామ్ రూ. 10 వేలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. బుధవారం ఆయన ఈ మొత్తాన్ని చిన్నబజారులో వున్న ఆ సంస్థ కార్యాలయంలో పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. అలాగే విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ కూడా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఇద్దరి ఎంపిక

భీమునిపట్నం (రూరల్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొకర వాసు, బుత్తల సునీత అండర్ 17 విభాగంలో రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈమేరకు పాఠశాల పీడీ లలిత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల భీమిలి పట్టణంలోని సన్ స్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. ఈనెల 10 నుంచి నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం గాదు పైడిరాజు , స్కూల్ కమిటీ చైర్మన్ శంకరరావు తదితరులు అభినందించారు.

## ఘనంగా కార్పొరేటర్ హేమలత జన్మదిన వేడుకలు



హేమలత జన్మదిన వేడుకల్లో పాల్గొన్న అధికారులు, నాయకులు

కొమ్మాది, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. బుధవారం బొట్టవానిపాలెంలో ఉన్న టీడీపీ కార్యాలయంలో ఆమె జన్మదిన వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో జోన్ 1 కమిషనర్ సింహాచలం, ఏపీడీ శ్రీరామ్, టీడీపీ నాయకులు వాండ్రాసి అప్పలరాజు, బోయి శ్రీనివాస్, రమాదేవి, నమ్మి శ్రీను, నాగోతి సత్యనారాయణ, ఈగల రవి, మొల్లి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని వ్యక్తి మృతి

భోగాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సవరవల్లి సమీపంలో లారీ, బైక్ ఢీకొన్న సంఘటనలో కొడుకు మృతి చెందగా... తల్లి తీవ్రంగా గాయపడింది. పద్మనాభం మండలం పాండ్రంకి గ్రామానికి చెందిన తల్లీ కుమారుడు కర్రి ఆదిలక్ష్మి, సూరిబాబు (40) బైక్‌పై ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం ఈకేవైసీ చేసుకొనేందుకు భోగాపురం హెచ్‌పీ గ్యాస్ గొదాంకు బుధవారం వెళ్లారు. అక్కడ ఈకేవైసీ పని ముగించుకొని విశాఖ నుంచి శ్రీకాకుళం వెళ్లే సర్వీస్ రోడ్డులో తగరపువలస వైపు వెళుతుండగా సవరవల్లి సమీపానికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో సూరిబాబు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదిలక్ష్మి తీవ్ర గాయాలపాలైంది. ప్రస్తుతం ఆమె విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. సూరిబాబు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి తల్లితో పాటు భార్య సంతోషి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఎన్ఐఓ పనుల్లో కదలిక

... 5వ పేజీ తరువాయి

బ్లాకుల్లో భవనాలు వస్తాయి. కొండపైకి ప్రస్తుతం రహదారి వేస్తున్నారు.

**పరిశోధనలు**

తూర్పు తీరంలో సముద్ర తీరాన నిర్మితమవుతున్న తొలి ఎన్ఐఓ కేంద్రం ఇదే. ఎదురుగా ఉన్న సముద్రం నుంచి నేరుగా లేబొరేటరీకి అవసరమైనంత నీరు వచ్చే ఏర్పాట్లు ఉంటాయి. సముద్ర జలాల్లో సంభవించే అన్ని మార్పులను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నివేదికలు తయారుచేస్తారు. అవసరమైనప్పుడు ముందస్తు సమాచారం, హెచ్చరికలు అందజేస్తారు. సముద్ర నీటిమట్టం పెరుగుదల, కాలుష్యం హెచ్చుతగ్గులు, అంతర్భాగంలో జరిగే మార్పులు అన్నీ ఇక్కడ అధ్యయనం చేస్తారు.

# ఉక్కుపై ద్వంద్వ వైఖరి

... 5వ పేజీ తరువాయి

ఉపయోగించాలని షరతు పెట్టింది. అంటే ఈ చేత్తో ఇచ్చి ఆ చేతితో తీసేసుకుంది. రెండో విడత ఇచ్చిన రూ.1,150 కోట్లలో కూడా చట్టబద్ధమైన చెల్లింపులు పూర్తిచేసి, మిగిలిన మొత్తం బ్యాంకులకు జమ చేసి, బొగ్గుకు అవసరమైన క్రెడిట్ లెటర్లు ఇప్పించారు. దీని వల్ల రెండో బ్లాస్ట్ ఫర్నేస్ మాత్రమే అదనంగా వినియోగంలోకి వచ్చింది. మూడో బ్లాస్ట్ ఫర్నేస్ గురించి, దానికి అవసరమైన ముడి పదార్థాల గురించి ఎవరూ మాట్లాడడం లేదు. ఉత్పత్తి 100 శాతం జరిగినప్పుడే లాభాలు వస్తాయి. మూడింటిలో రెండు బ్లాస్ట్ ఫర్నేసులు నడుపుతూ సెయిల్‌కు దీటుగా లాభాలు తేవాలని చెబుతున్నారు. సెయిల్‌లో ఉత్పత్తి సామర్థ్యం-ఉద్యోగుల సంఖ్య ఆధారంగా ఇక్కడ కూడా సిబ్బందిని సమకూర్చాలని కోరితే...అదనపు నియామకాలు చేపట్టకపోగా ఉన్న వారినే డిప్యుటేషన్‌పై పంపించేస్తున్నారు. ఉద్యోగుల కారణంగానే నష్టాలు వస్తున్నాయని ముద్ర వేయడానికి పెద్ద స్థాయిలో కుట్ర చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్లాంటు డైరెక్టర్లను ఉత్సవ విగ్రహాల్లా మార్చేసి, అన్ని నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకుంటున్న ఇన్‌చార్జి సీఎండీని తక్షణమే ఇక్కడి నుంచి పంపించి, ఆ స్థానంలోకి గతంలో పనిచేసి ప్లాంటును లాభాల్లోకి తెచ్చిన బీఎన్ సింగ్‌ను స్పెషల్ ఆఫీసర్‌గా తేవాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

# జాబ్ స్కామ్ కేసులో మల్కాపురం వాసి అరెస్టు

... 5వ పేజీ తరువాయి

పరిచయమైంది. కంబోడియా వంటి దేశాలకు నిరుద్యోగులను పంపిస్తే మంచి కమీషన్ వస్తుందని వెంకటరాఘవ చెప్పడంతో ముగ్గురిని రమేష్ వివిధ దేశాలకు పంపించాడు. వెంకటరాఘవ కూడా కంబోడియాకు వెళ్లి కుక్‌గా స్థిరపడ్డాడు. అప్పటి నుంచి రమేష్ ద్వారా భారత్ నుంచి వచ్చిన వారిని రిసీవ్ చేసుకుని, ఫిలిప్పీన్స్‌కి చెందిన ఆర్య హబీబ్‌తో కలిసి చైనా కంపెనీలకు పంపించేవాడు. ఇలా 12 మందిని చైనా స్కామ్ కంపెనీలకు పంపాడు. ఈ కేసులో ఇప్పటికే చుక్కా రమేష్‌ను అరెస్టు చేసిన పోలీసులు పార్థసారథిపై నిఘా పెట్టారు. అతడు కంబోడియా నుంచి బ్యాంకాక్, అక్కడి నుంచి భువనేశ్వర్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడన్న సమాచారంతో అక్కడి అధికారులను అప్రమత్తం చేశారు. భువనేశ్వర్ ఎయిర్‌పోర్టు ఇమ్మిగ్రేషన్ అధికారులు బుధవారం పార్థసారధిని అడ్డుకుని, విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అతడిని అరెస్టు చేసి విశాఖ తీసుకుచ్చి, రిమాండుకు తరలించారు.

# దీపం లబ్ధిదారులకు గ్యాస్ డబ్బులు

... 5వ పేజీ తరువాయి

నాలుగో తేదీ వరకు 59,275 మందికి డెలివరీ ఇచ్చారు. మరో 70,281 మందికి సిలిండర్లు ఇవ్వాల్సి ఉంది.. అత్యధికంగా హెచ్‌పీసీఎల్ కంపెనీ...43,186 మంది సిలిండర్ బుక్ చేయగా 31,786 (73.6 శాతం) మందికి, ఆ తరువాత బీపీసీఎల్ 25,330కి గాను 14,710 (56.83 శాతం) మందికి, ఐఓసీఎల్ 35,793కు గాను 12,779 మందికి (35.7 శాతం) సిలిండర్లు డెలివరీ ఇచ్చాయి. అయితే సిలిండర్ డెలివరీ అయిన వినియోగదారులందరికీ సొమ్ములు జమ కాలేదు. సాంకేతికంగా ఇబ్బందులున్న చోట్ల పెండింగ్ చూపిస్తోంది. ఈ నేపథ్యంలో వినియోగదారుడు తమకు సిలిండర్ సరఫరా చేసే గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి ఈకేవైసీ చేసుకోవాలని డీఎస్‌వో భాస్కరరావు సూచించారు. తొలి సిలెండర్ బుక్ చేసుకునేందుకు వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు గడువు ఉందని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బహుశా రెండు, మూడు రోజుల తరువాత గ్రామ/వార్డు సచివాలయాల్లో ఈకేవైసీ సదుపాయం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.

## పర్యావరణంపై జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ శశిభూషణరావు తదితరులు

వెంకోజీపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఏయూ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో డిసెంబరు5 నుంచి 7 వరకు నిర్వహించను న్న నానో మెటీరియల్స్ ఫర్ ఎనర్జీ క్యాటలిసిస్ అండ్ ఎన్విరాన్‌మెంట్ జాతీయ సదస్సు పోస్టర్‌ను ఏయూ వీసీ జి.శశిభూషణరావు తన కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించా రు. డీఎస్‌టీ-పిస్ట్ పథకంలో భాగంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులో నానో మెటీరియల్స్, క్యాటలిసిస్, ఫోటో క్యాటలిసిస్, ఎన్విరాన్‌మెంటల్ రెమిడియేషన్, బయోమాస్ కన్వర్షన్ తదితర అంశాలపై నిపుణుల ప్రసంగాలు, పరిశోధనా పత్రాల సమర్పణ ఉంటాయి. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ టి.శివరావు, విభాగాచార్యులు పి.శ్యామల, బీబీవీ శైలజ, వి.సిద్ధయ్య, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు ఓఎన్‌డీసీ లాభదాయక వేదిక

» జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్


సమావేశంలో మాట్లాతున్న జీవీఎంసీ కమిషనర్, పాల్గొన్న ఎస్‌హెచ్‌జీ మహిళా వ్యాపారులు

వెంకోజీపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు పరుస్తున్న ఓపెన్ నెట్వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) నగరంలో గల చిన్న చిన్న వ్యాపారస్తులు, ఉత్పత్తిదారులు, ఎస్‌హెచ్‌జీ మహిళా వ్యాపారులకు ఓ లాభదాయక వ్యాపార వేదిక అని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన నగరంలో గల చిరు వ్యాపారులు, ఎస్‌హెచ్‌జీ మహిళా వ్యాపారస్తులతో ఓఎన్‌డీసీ ఆన్లైన్ వ్యాపార వేదిక వినియోగంపై జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అవగాహన సదస్సును నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓఎన్‌డీసీ ఆన్‌లైన్ వ్యాపార వేదిక దేశంలోనే మొట్టమొదటి ఓపెన్ నెట్వర్క్ మార్కెట్ ప్లేస్‌గా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఓఎన్‌డీసీ కనెక్టెడ్ మార్కెట్ ప్లేస్ అని, ఇది వ్యాపారస్తులకు, కొనుగోలుదారులకు ఒక సులభతరమైన లాభదాయకమైన వ్యాపార వేదిక అని కమిషనర్ తెలిపారు. ఇప్పటికే మెప్మా సాంకేతిక సహకారంతో ఎస్‌హెచ్‌జీ మహిళలు ఉత్పత్తి చేసిన 185 రకాల వస్తువులను ఇందులో అప్‌లోడ్ చేయడం ద్వారా వ్యాపారం జరిగిందన్నారు. ఈ వ్యాపార వేదికలో సందేహాలను నివృత్తి చేసుకునేందుకు జీవీఎంసీ మెప్మా యంత్రాం గం అందుబాటులో ఉంటుందని, ఈ విషయమై ఓఎండీసీ సాంకేతిక సహాయకులు బాలశేఖర్‌ను ఫోన్ : 63058 75089లో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీసీ డీవీ రమణమూర్తి, పీడీ యూసీడీ పీఎం సత్యవేణి, యూసీడీ ప్రాజెక్టు అధికారి డి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సింహాద్రి రెండో యూనిట్‌లో ఉత్పత్తికి అంతరాయం

పరవాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌లో ఉత్పత్తికి బుధవారం అంతరాయం ఏర్పడింది. ఇదే యూనిట్‌కు సంబంధించి బాయిలర్ ట్యూబ్‌లకు రంధ్రాలు ఏర్పడడంతో ఉత్పత్తి అర్ధాంతరంగా నిలిచిపోయింది. అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు ప్రారంభించారు. కాగా మిగతా ఒకటి, మూడు, నాలుగు యూనిట్‌ల్లో ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరుగుతున్నదని అధికారులు తెలిపారు.

## సినిమా గైడ్

● క : జగదాంబ, శ్రీరామ, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)

● లక్కీ భాస్కర్ : మెలోడి, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)

● అమరన్ : శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

● బఘీర : వెంకటేశ్వర, సంగం, కిన్నెర, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ)

● దేవర : రమాదేవి, శ్రీకన్య (గాజువాక). తాతా (తగరపువలస)

## ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు


పూజలు చేస్తున్న మహిళలు

వెంకోజీపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని పీల వీధిలో గౌరీ పరమేశ్వరి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి భక్తి పాటలను ఆలపిస్తూ, భజనలు చేస్తూ గౌరీ పరమేశ్వరులను కొలిచారు.

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 34, వంకాయలు (తెలుపు) 34,వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 36, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 42, బీరకాయలు 36, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 60, క్యాబేజీ 36, క్యారెట్ 68 దొండకాయలు 32, బంగాళదుంపలు 40, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 60, బరబటి 40, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 40, దోస కాయలు 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 42, కీరదోస 28, కాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 26, కంద 72, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్రరెపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

**కోడిగుడ్లు (నెక్)**

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 550 |
| విజయనగరం | 554 |
| శ్రీకాకుళం | 554 |

**చికెన్ ధరలు**

| | |
|---|---|
| బ్యాగ్ | |
| రైతు ధర | 110 |
| ఫారం ధర | 130 |
| విత్ స్కిన్ | 230 |
| స్కిన్‌లెస్ | 240 |

## పారిశ్రామికవేత్త బీవీ రామారావు కన్నుమూత


రామారావు పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

వెంకోజీపాలెం, నవంబరు 6 : పారిశ్రామికవేత్త బీవీ రామారావు మంగళవారం అర్ధరాత్రి కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు. ఆయనకు భార్య సతీసావిత్రి, కుమార్తె వసంతలక్ష్మి, కుమారు బీవీ రామ్ ఉన్నారు. రామారావు పార్థివదేహాన్ని పాత వెంకోజీపాలెంలోని ఎంవీపీ రెసిడెన్సీలో ఉంచారు. రామారావు అభిమానులు, శ్రేయోభిలాషులు బుధవారం ఆయన పార్థివ దేహాన్ని సందర్శించారు. గురువారం రాజమండ్రిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు ఆయన తనయుడు బీవీ రామ్ తెలిపారు.

## కాలుష్య నియంత్రణలో హెచ్‌పీసీఎల్ సేవలు స్ఫూర్తిదాయకం

» జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్


ముడసర్లోవ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద మొక్కలు నాటుతున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, హెచ్‌పీసీఎల్ డైరెక్టర్ రంగనాథన్‌రామకృష్ణ తదితరులు

ఆరిలోవ, నవంబరు 6 : (ఆంధ్రజ్యోతి) : నగర కాలుష్య నియంత్రణను సామాజిక బాధ్యతగాతీసుకొని హెచ్‌పీసీఎల్ విశాఖ రిఫైనరీ విశేష సేవలు అందిస్తోందని జీవీఎంసీ కమిషనర్ సి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ముడసర్లోవ గార్బేజీ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద హెచ్‌పీసీఎల్ సహకారంతో రూ.88 లక్షల సీఎస్‌ఆర్ నిధులతో 26, 500 మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంగనాథన్ రామకృష్ణతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ముడసర్లోవ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద తొలుత మొక్కలను నాటారు. ఈ ఈ ప్రాంతాన్ని నందనవనంగా తయారు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ ఆర్.సోమన్నారాయణ, జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పి.శివప్రసాద్‌రాజు, పర్యవేక్షణ ఇంజనీరు గోవిందరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజనీరు దిలీప్, ఏఎంవోహెచ్ డాక్టర్ కిశోర్‌కుమార్, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు, సహాయక ఇంజనీర్లు, హెచ్‌పీసీఎల్ సీనియర్ మేనేజర్ కాళీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

## యువతతో సామాజిక చైతన్యం పెంపొందించాలి

» ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారావు


మాట్లాడుతున్న ప్రొఫెసర్ నరసింహారావు

వెంకోజీపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : యువతలో సామాజిక చైతన్యం పెంపొందించేలా జాతీయ సేవాపథకం ప్రోగ్రాం అధికారులు పనిచేయాలని ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు అన్నారు. బుధవారం ఏయూ ఎన్ఎస్ఎస్ సమావేశ మందిరంలో హెరిటేజ్ ఫౌండేషన్‌తో సంయుక్తంగా ప్రోగ్రాం అధికారులకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ యువత వైఖరులను మార్పు చేసే విధంగా కార్యక్రమాలు నిర్వహించడం అవసరమని చెప్పారు. జాతీయ సేవా పథకం సమన్వయకర్త ఎస్.హరనాథ్ మాట్లాడుతూ వృద్ధులు శారీరక, మానసిక వేధింపులకు గురికాకుండా చూడాలన్నారు. హెరిటేజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎన్ఆర్ గంగాధరన్ మాట్లాడుతూ ఒకరిని మరొకరు అర్థం చేసుకుంటే సమస్యను పరిష్కరించడం సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా సమన్వయకర్తలు ఈపీఎస్ భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్‌పాల్గొన్నారు.

## ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ యాప్ వినియోగంపై ఆర్పీలకు శిక్షణ


జ్యోతి ప్రజల్వన చేసి వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

సిరిపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆర్పీలు ఒక శక్తిగా ఉండాలని, స్లమ్‌లో మార్పు తెచ్చేలా విధులు నిర్వహించాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం గురజాడ కళాక్షేత్రంలో ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ యాప్ వినియోగం, విధి విధానాలపై జీవీఎంసీ స్థాయిలో ఆర్పీలకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనపై చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఆ దిశగా ఈ ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ యాప్‌ను ఈ నెల 31లోగా పూర్తి వివరాలతో నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రధానంగా ఆర్పీలు వారి పరిధిలో ప్రతి ఇంట రోజూ ఉత్పత్తి అయ్యే వ్యర్థాల విభజన, సేకరణ, తరలింపు, రోడ్ల పరిశుభ్రత, కాలువలలో వ్యర్థాలు పేరుకుపోకుండా గమనించి వాటిని నిర్ణీత సమయంలో పరిశుభ్రత దిశగా మార్పుకు సహకరించాలన్నారు. ఖర్చుల అదుపు, పిల్లల చదువులు వంటి అంశాలపై అవగాహనకలిగించాలన్నారు. ఏడీసీ డీవీ రమణమూర్తి, పీడీ యూసీడీ పీఎం సత్యవేణి, ప్రాజెక్టు అధికారులు, డెప్యూటీ ప్రాజెక్టు అధికారులు, మెప్మా, యూసీడీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గౌరీపరమేశ్వరుల ఉత్సవాలకు ఆహ్వానం


ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

వెంకోజీపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డులోని పాత వెంకోజీపాలెం శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి స్థానిక రామాలయంలో నిర్వహించనున్న గౌరీ పరమేశ్వరి నవరాత్రి ఉత్సవాలకు కేంద్ర గౌరీ సంఘానికి ఆహ్వాన పత్రికను బుధవారం సాయంత్రం అందజేశారు. గవర కులస్థులు నిర్వహించుకునే ఈ ఉత్సవంలో కేంద్ర గౌరీ సంఘం నుంచి సభ్యులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఆడారి పరదేశినాయుడు, కోశాధికారి పోలమరశెట్టి త్రినాథ్, ఆడిటర్ మళ్ల రవికుమార్ పాల్గొన్నారు.

## రైల్వేస్టేషన్లలో డిజిటల్ చెల్లింపులు

» ప్రత్యేక డ్రైవ్‌లతో ప్రయాణికులకు అవగాహన


డిజిటల్ చెల్లింపులను పరిశీలిస్తున్న సీనియర్ డీసీఎం కె.సందీప్

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ ఇండియాలో భాగంగా వాల్తేరు డివిజన్‌లోని అన్ని స్టేషన్లలో క్యూ ఆర్ కోడ్ డిజిటల్ చెల్లింపులు విస్తృతం చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. డిజిటల్ చెల్లింపు విధానం ఆగస్టులో ప్రవేశపెట్టినా ప్రయాణికులకు పూర్తి అవగాహన కల్పించలేదు. ఇప్పుడు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టి డిజిటల్ చెల్లింపులు విస్తృతం చేయడంతోపాటు ప్రత్యేక డ్రైవ్‌లతో అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో పాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ (పీఆర్ఎస్), అన్ రిజర్వ్ టికెట్ సిస్టమ్ (యుటీఎస్) కేంద్రాల్లో క్యూ ఆర్ కోడ్ ద్వారా టికెట్ రుసుములు చెల్లించవచ్చునని తెలిపారు. వాల్తేరు డివిజన్ పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్లలో ఈ సదుపాయం అందుబాటులోకి తీసుకువచ్చామని, ఫోన్ పే, గూగుల్ పే, ఇతర ప్రసిద్ధ యూపీఐ యాప్‌లతో సులభంగా టికెట్ రుసుము చెల్లించవచ్చునని సందీప్ పేర్కొన్నారు. డిజిటల్ చెల్లింపుల ద్వారా ప్రయాణికుల సమయం ఆదా అవుతుందని, క్యూ లైనులో నిలబడాల్సిన అవసరం లేకుండా పేపర్ లెస్ టికెట్ పొందవచ్చునని పేర్కొన్నారు. ప్రయాణికులు అవగాహన పెంచుకుని టికెట్ చెల్లింపు లావాదేవీలు సులభంగా పూర్తి చేసుకోవచ్చునని డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్ పేర్కొన్నారు.

## వృద్ధుల ప్రాధాన్యం వివరిస్తూ బీచ్‌రోడ్డులో వాక్‌థాన్


బీచ్‌రోడ్డులో వాక్‌థాన్ నిర్వహిస్తున్న దృశ్యం

రామ్‌నగర్, నవంబరు 6 : (ఆంధ్రజ్యోతి) : సమాజంలో వృద్ధుల ప్రాధాన్యతను గుర్తించాలని హెరిటేజ్ ఫౌండేషన్ ఇండియా చైర్మన్ డాక్టర్ కెఆర్ గంగాధరన్ పేర్కొన్నారు. సమాజంలో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను తెలియజేస్తూ వారి ఆవశ్యకతను సమాజానికి చాటిచెప్పేందుకు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ, హెరిటేజ్ ఫౌండేషన్, ఆర్ఆర్‌టీసీ ఏయూ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) సంయుక్త ఆధ్వర్యంలో బుధ వారం బీచ్‌రోడ్డులో వాక్‌థాన్ నిర్వహించారు. బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు ఈ వాక్‌థాన్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ సమాజంలో వృద్ధులకు తగిన గౌరవా న్ని కల్పించడం, భద్రతను ఇవ్వడం ఎంతో అవసరమన్నారు. నేడు సమాజంలో వృద్ధులు, యువతకు మధ్య దూరం పెరుగుతోందని, ఇది ఎంతమాత్రం వాంఛనీయం కాదన్నా రు. యాంత్రిక జీవనంలో వృద్ధులకు తగిన గుర్తింపు లభించడం లేదని అన్నారు దేశవ్యాప్తంగా వృద్ధుతు ఎదుర్కొంటున్న విభిన్న సమస్యలకు పరిష్కారం చూపడం మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎస్.హరనాథ్, జాతీయ సేవా పథకం వలంటీర్లు, హెరిటేజ్ ఫౌండేషన్ ప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


## ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్న ప్రభుత్వాలు : సీపీఎం నేత పద్మ


సమావేశంలో మాట్లాడుతున్న పద్మ

ఆరిలోవ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై పెను ఆర్థిక భారాన్ని వేసేందుకు సిద్ధం అవుతున్నాయని, మరోవైపు విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వేగవంతం చేస్తూ గుబురు పుట్టిస్తున్నాయని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు బి.పద్మ వివరించారు. మద్దిలపాలెం, ఆరిలోవ, మధురవాడ జోన్లు మద్దిలపాలెం జోన్‌గా ఆరిలోవ ఎర్ని దుర్గమాంబ కల్యాణ మండపంలో సీపీఎం 8వ మహాసభ బుధవారం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ రెడ్డిపల్లి బాబూరావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడిన పద్మ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు.ప్రజాపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.













## జాబ్ మేళా రేపు

కంచరపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐని ఆనుకుని ఉన్న నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్ వద్ద ఈ నెల 8న నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా ఏర్పాటు చేస్తున్నట్టు ఉప ఉపాధి కల్పన అధికారి శ్యాంసుందర్ నిట్టల తెలిపారు. మేళాలో నవత ట్రాన్స్‌పోర్ట్ సంస్థ, ఏషియన్ ఆటో పార్ట్సు ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థలు పాల్గొని 75 ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా కోర్సులు పూర్తిచేసిన యువత హాజరుకావచ్చు. ఎంపికైన వారికి నెలకు రూ.10వేలు నుంచి రూ.15 వేలు చెల్లిస్తారు. అభ్యర్థులు ముందుగా నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలి. ఆసక్తి, అర్హత గల నిరుద్యోగులు 8న ఉదయం 9 గంటలకు బయోడేటా, అర్హత ధ్రువపత్రాలతో హాజరుకావాలని శ్యాంసుందర్ సూచించారు.

### బాలల దినోత్సవం పోస్టర్ విడుదల

డాబాగార్డెన్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాల్యం చాలా విలువైనదని, ఆ అనుభూతి పిల్లలకు అందించడం మనందరి బాధ్యత అని వీసీసీ వ్యవస్థాపకులు రమాప్రభ పేర్కొన్నారు. బుధవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలోని ఇంటరాక్ట్ క్లబ్స్ ఆఫ్ వీసీసీ బాలల దినోత్సవం-2024 పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైజాగ్ చిల్డ్రన్ క్లబ్, రోటరీ క్లబ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఇంటరాక్ట్ క్లబ్స్‌లో ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు క్లబ్స్‌లో బాలల దినోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది సర్వీసు అబౌ సెల్ఫ్ అనే థీమ్‌తో క్లబ్ లీడర్లు, వాలంటీర్లు బాలల కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తాయన్నా రు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ గాంధీ, ఎల్లాజీ, సునీత, భవాని, మణి తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ నిజాయితీ



పోలీసుల సమక్షంలో ఉంగరం అప్పగిస్తున్న ఆటో డ్రైవర్ దేముడు బాబు

అక్కయ్యపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తన ఆటోలో దొరికిన బంగారు ఉంగరాన్ని ఆటో డ్రైవర్ నిజాయితీగా ట్రాఫిక్ పోలీసుల సమక్షంలో పోగొట్టుకున్న వ్యక్తికి బుధవారం అప్పగించారు. గోల్డెన్ జూబ్లీ ఆటో స్టాండ్ డ్రైవర్ దేముడుబాబుకు తన ఆటోలో ప్రయాణించిన వ్యక్తికి చెందిన అరతులం బంగారు ఉంగరం దొరికింది. డ్రైవర్ నిజాయితీగా నాల్గో పట్టణ ట్రాఫిక్ ఎస్సై వాణిశ్రీ, ఏఎస్సై రమణ ఆధ్వర్యంలో పోగొట్టుకున్న వ్యక్తికి ఆ ఉంగరాన్ని అప్పగించారు. దీంతో ఆటో డ్రైవర్‌ను పోలీసులు అభినందించారు.

## గౌరీపరమేశ్వర ఉత్సవాలకు రాటమహోత్సవం



రాట మహోత్సవంలో పాల్గొన్న సంఘం ప్రతినిధులు

కంచరపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం మెట్టు నుంచి సిద్ధార్థనగర్ వరకు గౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు బుధవారం ఘనంగా రాటమహోత్సవం చేశారు. ఏటా ఇక్కడ కార్తీకమాసంలో ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కుంకుమ పూజలు, అభిషేకాలు, అమ్మవారి సారె ఊరేగింపు తదితర ఘట్టాలను వైభవంగా చేపట్టనున్నట్టు కమిటీ గౌరవాధ్యక్షుడు కె.సూర్యనారాయణ, అధ్యక్షుడు ఆళ్ల లక్ష్మీనారాయణ, కార్యదర్శి రామప్పడు తెలియజేశారు. రాట మహోత్సవంలో 57వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పెంటకోట అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### 'నైపుణ్య సర్వేకు సహకరించండి'

అల్లిపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యువతలో ఉన్న వాస్తవిక నైపుణ్యాలను గుర్తించి వారికి అవసరమైన నైపుణ్యాభివృద్ధిని అందించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లు సంకల్పించారు. వారి ఆదేశాల మేరకు జోన్-4 పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న యువతపై నైపుణ్య సర్వే నిర్వహిస్తున్నామని జోన్-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయడు తెలియజేశారు. ఈ సర్వే కోసం వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కుటుంబ సభ్యులకు మానసిక రోగి అప్పగింత

అక్కయ్యపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న బెంగళూరుకు చెందిన వెంకట రమణను అతని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఆరు నెలల క్రితం విశాఖ రైల్వేస్టేషన్‌లో దిక్కుతోచని స్థితిలో ఉండగా ఏయూటీడీ సిబ్బందితో వెళ్లి తీసుకొని వచ్చి ఆశ్రయం కల్పించినట్లు చెప్పారు. ఆయన హరేయన బాబా మందిరానికి వెళ్లాలని రోజూ గొడవ చేసేవారన్నారు. అభద్రతా భావంతో ఉంటూ ఎవరినీ నమ్మేవారు కాదని పేర్కొన్నారు. పదేళ్లుగా మానసిక రుగ్మతతో బాధపడుతూ మందులు వాడకపోవడంతో వ్యాధి తీవ్రత పెరిగిందన్నారు. శ్రద్ధా టీం చికిత్స, మందుల వల్ల వ్యాధి నయమైంది. అతని కుమారుడి చిరునామా చెప్పడంతో వెంకటరమణను బెంగళూరులోని అతని కుమారుడు శ్రావణ్‌కుమార్ కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు చెప్పారు.

# కర్నూలు ఉల్లికి డిమాండ్



సీతమ్మధార రైతుబజార్‌లో విక్రయిస్తున్న చిన్న ఉల్లిపాయలు

సీతమ్మధార, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత రెండు, మూడు నెలలుగా ఉల్లి, టమాటా ధరలు కొండెక్కి కూర్చున్నాయి. దాదాపు అన్ని నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినా, రోజూ ఎక్కువగా అవసరమయ్యే ఉల్లి, టమాటా ధరలు మండిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీన్ని గమనించిన ప్రభుత్వం రాయితీపై రైతు బజార్లలో తొలుత ఉల్లి, ఆ తరువాత టమాటా విక్రయాలు ప్రారంభించింది. టమాటా ధర కొంతమేర తగ్గినా, ఉల్లిఘాటు స్థిరంగా ఉంది. బయట మార్కెట్‌లో ఈ రెండింటి ధరలు కిలో అరవై పైమాటే. రైతు బజార్లలో పెద్దసైజు ఉల్లి రూ.52 నుంచి రూ.55 వరకు ఉండగా, టమాటా రూ.43 వద్ద ఉంది. తోపుడుబండ్లపై వీధుల్లో తిరిగి విక్రయించేవారు సైతం ధరలు మండిపోతున్నాయని భావించి తక్కువ ధరకు లభ్యమయ్యే సరకునే తీసుకొస్తున్నారు. ఈ తరుణంలో గత పదిహేను రోజుల నుంచి కర్నూలు నుంచి చిన్న ఉల్లిపాయలు రావడంతో వీటిని కొనుగోలు చేయడానికి ప్రజలు మొగ్గు చూపుతున్నారు. సీతమ్మధార రైతుబజార్‌లో వీటి కోసం ఎగబడుతున్నారు. దీంతో కౌంటర్‌ల వద్ద రద్దీ పెరిగింది. దీపావళి, నాగుల చవితి పండుగల సందర్భంగా ఉత్తరాదిలో సెలవులు తీసుకోవడంతో లారీల్లో రవాణా జరగక ఎగుమతి, దిగుమతులు నిలిచిపోయాయి. దీంతో అక్కడి నుంచి ఉల్లిపాయలు ఇక్కడి టోకు (హోల్‌సేల్) మార్కెట్‌కు తక్కువగా వస్తున్నాయి. మహారాష్ట్ర నుంచి వస్తున్న ఉల్లిపాయలు కిలో రూ.58, సోలాపూర్ ఉల్లి కిలో రూ.52, కర్నూలు నుంచి వచ్చిన చిన్న ఉల్లిపాయలు కిలో రూ.36 ధర ఉండటంతో కర్నూలు ఉల్లి కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. చిన్న ఉల్లిపాయలైనా ఘాటుగా ఉంటున్నాయని చెబుతున్నారు. కార్తీక మాసంలో చాలామంది ఆహార పదార్థాల్లో ఉల్లి వాడరు. ఇలాంటి తరుణంలో అయినా ధరలు సాధారణ స్థితికి వస్తాయనుకుంటే ఏమాత్రం మార్పు లేదు. రైతుబజార్‌లో రెండు రకాలు ఉన్నప్పటికీ, చిన్న ఉల్లిపాయల వద్దకే అందరూ ఎగబడుతున్నారు. తోపుడు బళ్ల వ్యాపారులు సైతం చిన్న ఉల్లినే విక్రయిస్తున్నారు. తెల్ల ఉల్లి (వెల్లుల్లి) ధర ఇంకా కొండెక్కి కూర్చోవడంతో ప్రజలు నిట్టూరుస్తున్నారు.

## రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, జడ్పీ, కార్పొరేటర్ తదితరులు

జ్ఞానాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా గతుకుల రోడ్లుతో ఇబ్బందులు పడుతున్న గ్రేటర్ 41వ వార్డు సెబాస్టియన్ కాలనీ వాసులకు ఎట్టకేలకు ఎమ్మెల్యే వంశీకృష్ణ, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా చొరవతో ఇబ్బందులు తొలగనున్నాయి. స్థానికుల విజ్ఞాపనలు, పత్రికల్లో కథనాలతో స్పందించిన ఇంజనీరింగ్ అధికారులు బుధవారం రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమాతో కలసి రూ.19 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బి.రాము, ఏఈ సతీష్, కోడిగుడ్ల శ్రీధర్, వార్డు కూటమి అధ్యక్షులు బతి మదుబాబు, అంతోని శేఖర్, సంజీవరావు, కూటమి నాయకులు బతి రవిబాబు, కర్రి బానోజీరావు, గవర రమణ, పిల్లి గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

## చిరుధాన్యాలతో ట్రంప్ చిత్రపటం



విజయచిహ్నం చూపుతున్నట్లుగా రూపొందించిన ట్రంప్ చిత్రపటం

డాబాగార్డెన్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అమెరికా అధ్యక్షునిగా డోనాల్డ్ ట్రంప్ రెండోసారి ఎన్నికైన సందర్భాన్ని పురస్కరించుకొని విశాఖకు చెందిన చిత్రకారుడు మోకా విజయకుమార్ చిరుధాన్యాలతో ట్రంప్ చిత్రపటాన్ని సహజసిద్ధంగా తయారు చేశారు. విజయ చిహ్నాన్ని చూపుతున్నట్టుగా, ట్రంప్ చిత్రం వెనుక భాగంలో అమెరికా జెండాను సైతం తీర్చిదిద్దారు. భారత అమెరికా సంబంధాలు మరింత బలోపేతం కావాలని మనసారా కోరుకుంటూ ఈ విధంగా అమెరికా అధ్యక్షునికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్టు విజయకుమార్ చెప్పారు.

### జెడ్పీ సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు

మహారాణిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్‌లో ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లకు పరిపాలనా అధికారులుగా పదోన్నతులు కల్పించారు. వీరిలో ఎన్‌వీహెచ్‌ఆర్ స్వామి రావికమతం మండలం, వీఆర్ రాజేశ్వరి విశాఖ జిల్లా పరిషత్‌కు, వేణుగోపాల్‌ను డుంబ్రిగూడ మండల పరిపాలనాధికారులుగా నియమించారు. జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, సీఈవో పి.నారాయణమూర్తి వీరికి పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆదాయం పెంపునకు ప్రణాళికలు

- ముఖ్య నగరాల్లో కన్వెన్షన్ సెంటర్ల ఏర్పాటు
- ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వి.బాబూరావు



సమావేశంలో మాట్లాడుతున్న వజ్జ బాబూరావు

మద్దిలపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆదాయం పెంపునకు పటిష్ఠ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు తెలిపారు. పిఠాపురం కాలనీ జనశిక్షణ సంస్థాన్ భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం నుంచి నిధులు తెచ్చుకోవడంతో పాటు తమ సంస్థకున్న ఆస్తులు, వ్యాపారాల ద్వారా ఆదాయం వృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కార్పొరేషన్‌కు ఆస్తులు ఉండేవని, విభజన తర్వాత సంస్థ కార్యకలాపాలు తగ్గాయన్నారు. ప్రస్తుతం కార్పొరేషన్‌కు రాష్ట్రంలో ఉన్న ఆస్తులు పరిశీలిస్తున్నామన్నారు. కార్పొరేషన్‌కు రాష్ట్ర బడ్జెట్ ఉండదని, కేంద్రమే నిధులు కేటాయించాల్సి ఉంటుందన్నారు. నగరంలోని నగరంలో రేసపువానిపాలెంలో 2.5 ఎకరాలను స్పెన్సర్ సంస్థ లీజుకు తీసుకుందని, గాజువాకలో 3.5 ఎకరాల్లో ఎగుమతి గిడ్డంగి ఉందన్నారు. అమరావతి, విశాఖ, తిరుపతి నగరాల్లో కన్వెషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఆరు నెలలకోసారి ట్రేడర్స్‌కు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. సంస్థలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి కృషి చేస్తామన్నారు. కార్పొరేషన్ జనరల్ మేనేజర్ హనుమా నాయక్ మాట్లాడుతూ సంస్థ ద్వారా లేపాక్షి, నంది బ్రాండ్ పేరుతో నోటు పుస్తకాలు విక్రయిస్తున్నామన్నారు. ప్రభుత్వ శాఖలకు సిమెంట్ సరఫరా చేస్తున్నామన్నారు. కార్పొరేషన్‌కు పూర్వ వైభవం తెచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## మిస్టర్ ఆంధ్ర యూనివర్సిటీగా గోపీచంద్




శరీర సౌష్ఠవ ప్రదర్శన ఇస్తున్న గోపీచంద్‌తో అతిథులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏయూ అంతర్ కళాశాలల దేహదారుఢ్య పోటీల్లో మిస్టర్ ఆంధ్ర విశ్వవిద్యాలయం టైటిల్‌ను బుల్లయ్య కళాశాల విద్యార్థి గోపీచంద్ కైవసం చేసుకున్నాడు. కళాశాలలో జరిగిన ఈ టోర్నీలో గోపీచంద్ అద్భుతమైన ప్రతిభ కనబరిచి బెస్ట్ ఫిజిక్ ట్రోఫీని సొంతం చేసుకున్నాడు. అలాగే ఇక్కడ జరిగిన ఏయూ అంతర్ కళాశాలల పురుషుల మహిళల వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లోనూ బుల్లయ్య కళాశాల విద్యార్థులు పతకాలు సాధించి చాంపియన్ ట్రోఫీలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కాలేజి యాజమాన్యం, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, గంగాభవానితదితరులు అభినందించారు.

### పోలీసులకు యోగా శిక్షణ



యోగా సాధన చేస్తున్న పోలీసులు

జగదాంబ కూడలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యం, బుద్ధికుశలత, మానసిక ప్రశాంతత లభిస్తుందని విశ్వసించిన వన్‌టౌన్ సీఐ దేముడు బాబు తమ పోలీస్ స్టేషన్ సిబ్బందికి యోగా శిక్షణ ఇప్పిస్తున్నారు. వయసు మీరుతున్నా, ప్రజాసేవలో ఉన్న పోలీసులు నిత్యం చురుగ్గా ఉండేందుకు యోగా సాధన ఒక మార్గంగా ఆయన భావించారు. బుధవారం ఉదయం తమ స్టేషన్ సిబ్బందికి సెంట్ ఎలాసిస్ స్కూల్ ప్రాంగణంలో యోగా తరగతులు ఏర్పాటు చేశారు. యోగాతో తన సిబ్బంది మరింత ఉత్తేజంగా పనిచేస్తారనేది సీఐ ఆలోచన. యోగా తరగతులు పూర్తయిన తరువాత పోలీస్ సిబ్బందికి స్వయంగా అల్పాహారాన్ని ఆయన ఏర్పాటు చేయడం విశేషం.

## రైల్వేస్టేషన్లలో డిజిటల్ చెల్లింపులు

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్‌లోని అన్ని స్టేషన్లలో క్యూ ఆర్ కోడ్ డిజిటల్ చెల్లింపులు విస్తృతం చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ విధానం ఆగస్టులో ప్రవేశపెట్టినా ప్రయాణికులకు పూర్తి అవగాహన కల్పించలేదు. ఇప్పుడు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టి ప్రత్యేక డ్రైవ్‌లతో అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో పాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ (పీఆర్ఎస్), అన్ రిజర్వ్ టికెట్ సిస్టమ్ (యుటీఎస్) కేంద్రాల్లో క్యూ ఆర్ కోడ్ ద్వారా టికెట్ రుసుములు చెల్లించవచ్చునని తెలిపారు. వాల్తేరు డివిజన్ పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్లలో ఈ సదుపాయం అందుబాటులోకి తీసుకువచ్చామని, ఫోన్ పే, గూగుల్ పే, ఇతర ప్రసిద్ధ యూపీఐ యాప్‌లతో సులభంగా టికెట్ రుసుము చెల్లించవచ్చునని సందీప్ పేర్కొన్నారు. డిజిటల్ చెల్లింపుల ద్వారా ప్రయాణికుల సమయం ఆదా అవుతుందని, క్యూ లైనులో నిలబడాల్సిన అవసరం లేకుండా పేపర్ లెస్ టికెట్ పొందవచ్చునని పేర్కొన్నారు. ప్రయాణికులు అవగాహన పెంచుకుని టికెట్ చెల్లింపు లావాదేవీలు సులభంగా పూర్తి చేసుకోవచ్చునని డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ పేర్కొన్నారు.

# నూతన విధానంతో క్రీడా రంగానికి ఉత్తేజం

- ఎమ్మెల్యే గణబాబు



అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు శాసనసభ్యుడు గణబాబు

విశాఖపట్నం (స్పోర్ట్సు), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన నూతన క్రీడా విధానాలు రాష్ట్రంలోని ఔత్సాహిక క్రీడాకారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తాయని అంతర్జాతీయ వాలీబాలర్, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు గణబాబు ఆశాభావం వ్యక్తంచేశారు. అందరికీ క్రీడలు అనే విధానంతో రూపొందించిన నాలుగు విధానాలు దేశ క్రీడారంగంలో రాష్ట్రాన్ని ప్రధాన కేంద్రంగా నిలబెట్టడం ఖాయమన్నారు. జీవనోపాధి లక్ష్యంగా సాధన చేసేవారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వ సంస్థలలో క్రీడా కోటా నియామకాలను రెండు నుంచి మూడు శాతానికి పెంచడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఒలింపిక్స్ ఆసియా, ప్రపంచ, జాతీయ క్రీడల్లో పతకాలు సాధించేవారికి అందించే నగదు ప్రోత్సాహాలను భారీగా పెంచడం విశేషమన్నారు. ఒలింపిక్స్‌లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలకు వరుసగా రూ.7, రూ.5, రూ.3 కోట్లు ప్రకటించి ఒలింపిక్స్ స్థాయిని పెంచారని పేర్కొన్నారు. ఆసియా క్రీడల్లో పతకాలు సాధించేవారికి రూ.4 కోట్లు, రూ.2 కోట్లు, రూ.కోటి, ప్రపంచ క్రీడల పతకాలు సాధించినవారికి రూ.50 లక్షలు, రూ.35 లక్షలు, రూ.25 లక్షలు, జాతీయ క్రీడల్లో పతక సాధకులకు రూ.2.5, రూ.2 లక్షలు, రూ.లక్ష చొప్పున నగదు ప్రోత్సాహాలు అందించే పాలసీలు తీసుకురావడం విశేషమన్నారు. ప్రభుత్వ క్రీడా ప్రాంగణాలు ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసే విధానాలకు చెక్ పెట్టడం, రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా అకాడమీలు ఏర్పాటు చేయడం, క్రీడా ప్రాంగణాలు నిర్మించాలని నిర్ణయాలు తీసుకోవడంతో రాష్ట్రం నుంచి ఉన్నత స్థాయి క్రీడాకారులు రూపొందుతారని అభిప్రాయపడ్డారు.

## ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి: కలెక్టర్

మహారాణిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాస యోజనలో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణంలో మరింత పురోగతి సాధించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రోజుకు 150 నిర్మాణాలు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను నిర్దేశించారు ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి, ఇసుక సరఫరా, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై బుధవారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. లేఅవుట్‌ల వారీగా సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను సమన్వయంతో పరిష్కరించుకొని ముందుకు వెళ్లాలన్నారు.

### మత్స్య శాఖ జేడీగా లక్ష్మణరావు బాధ్యతల స్వీకారం

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా మత్స్య శాఖ జాయింట్ డైరక్టర్‌గా లక్ష్మణరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చి ఇప్పటివరకు జేడీగా పనిచేసిన విజయ తిరిగి కాకినాడకు వెళ్లిపోయారు.

## ఎన్ఐఓ పనుల్లో కదలిక

... 5వ పేజీ తరువాయి

బ్లాకుల్లో భవనాలు వస్తాయి. కొండపైకి ప్రస్తుతం రహదారి వేస్తున్నారు.

**పరిశోధనలు:** తూర్పు తీరంలో సముద్ర తీరాన నిర్మితమవుతున్న తొలి ఎన్ఐఓ కేంద్రం ఇదే. ఎదురుగా ఉన్న సముద్రం నుంచి నేరుగా లేబొరేటరీకి అవసరమైనంత నీరు వచ్చే ఏర్పాట్లు ఉంటాయి. సముద్ర జలాల్లో సంభవించే అన్ని మార్పులను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నివేదికలు తయారుచేస్తారు. అవసరమైనప్పుడు ముందస్తు సమాచారం, హెచ్చరికలు అందజేస్తారు. సముద్ర నీటిమట్టం పెరుగుదల, కాలుష్యం హెచ్చుతగ్గులు, అంతర్భాగంలో జరిగే మార్పులు అన్నీ ఇక్కడ అధ్యయనం చేస్తారు.

## ఉక్కుపై ద్వంద్వ వైఖరి

... 5వ పేజీ తరువాయి

ఉపయోగించాలని షరతు పెట్టింది. అంటే ఈ చేత్తో ఇచ్చి ఆ చేతితో తీసేసుకుంది. రెండో విడత ఇచ్చిన రూ.1,150 కోట్లలో కూడా చట్టబద్ధమైన చెల్లింపులు పూర్తిచేసి, మిగిలిన మొత్తం బ్యాంకులకు జమ చేసి, బొగ్గుకు అవసరమైన క్రెడిట్ లెటర్లు ఇప్పించారు. దీని వల్ల రెండో బ్లాస్ట్ ఫర్నేస్ మాత్రమే అదనంగా వినియోగంలోకి వచ్చింది. మూడో బ్లాస్ట్ ఫర్నేస్, దాని ముడి పదార్థాల గురించి ఎవరూ మాట్లాడడం లేదు. ఉత్పత్తి 100 శాతం జరిగినప్పుడే లాభాలు వస్తాయి. మూడింటిలో రెండు బ్లాస్ట్ ఫర్నేసులు నడుపుతూ సెయిల్‌కు దీటుగా లాభాలు తేవాలని చెబుతున్నారు. సెయిల్‌లో ఉత్పత్తి సామర్థ్యం-ఉద్యోగుల సంఖ్య ఆధారంగా ఇక్కడ కూడా సిబ్బందిని సమకూర్చాలని కోరితే...అదనపు నియామకాలు చేపట్టకపోగా ఉన్న వారినే డిప్యుటేషన్‌పై పంపించేస్తున్నారు. ఉద్యోగుల కారణంగానే నష్టాలు వస్తున్నాయని ముద్ర వేయడానికి పెద్ద స్థాయిలో కుట్ర చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకుంటున్న ఇన్‌చార్జి సీఎండీని తక్షణమే ఇక్కడి నుంచి పంపించి, ఆ స్థానంలోకి గతంలో పనిచేసి ప్లాంటును లాభాల్లోకి తెచ్చిన బీఎన్ సింగ్‌ను స్పెషల్ ఆఫీసర్‌గా తేవాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

# ట్రాఫికర్‌కు చెక్!

... 5వ పేజీ తరువాయి

గుర్తించారు. ప్రస్తుతం ఉన్న ఎయిర్‌పోర్టు నుంచి కొత్తగా నిర్మిస్తున్న భోగాపురం ఎయిర్‌పోర్టుకు కారులో వెళ్లడానికి అధికారులకే 1.15 గంటలు సమయం పట్టింది. అదే అనకాపల్లి నుంచి వచ్చేవారికి 2.30 గంటలు పట్టే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. దీని వల్ల ప్రయాణికులు ఎయిర్‌పోర్టుకు వెళ్లడానికి ఇబ్బందిపడే అవకాశం ఉంటుంది. కాబట్టి, అనకాపల్లి నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకూ ఎక్కడికక్కడ జాతీయ రహదారిని అనుసంధానం చేసేలా 15 రోడ్లను అభివృద్ధి చేయడం ద్వారా సమస్యకు చెక్ పెట్టవచ్చునని అధికారులు గుర్తించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొమ్మాదిలోని శివశక్తినగర్ నుంచి హరిత ప్రాజెక్టు రోడ్డు, బోయపాలెం జంక్షన్ నుంచి మంగమారిపేట, పరదేశిపాలెం జంక్షన్ నుంచి గంభీరం, దొరతోట జంక్షన్-కుమ్మరిపాలెం, మూలకుద్దు-నేరెళ్లవలస, నేరెళ్లవలస-తాళ్లవలస, గండిగుండం-కొత్తవలస, తగరపువలస-మూలకుద్దు, చిప్పాడ-దివీస్ రోడ్డు, బొడ్డవలస-విజయనగరం, మోపాడ-సవరవిల్లి, అడవివరం-గండిగుండం, పినగాడి-వేపగుంట, వేపగుంట-జుత్తాడ రోడ్లను బాగా విస్తరించేలా మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించారు. జీవీఎంసీ పరిధిలో రోడ్ల విస్తరణకు తీసుకునే భూమికి టీడీఆర్ జారీచేసేలా, అనకాపల్లి, విశాఖ, విజయనగరం జిల్లాల పరిధిలోని రోడ్ల విస్తరణకు తీసుకునే భూమికి యజమానులకు పరిహారం అందించాలని అధికారులు మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచారు. విస్తరించాలని ప్రతిపాదించిన 15 రోడ్ల నిర్మాణానికి రూ.404 కోట్లు అవసరం అవుతుందని అధికారులు అంచనా వేశారు. అందులో రూ.220 కోట్లు వీఎంఆర్‌డీ, రూ.120 కోట్లు జీవీఎంసీ, 64 కోట్లు రోడ్లు, భవనాల శాఖ భరించాల్సి ఉంటుంది.

### ఎక్కడికక్కడ వాహనాల మళ్లింపునకు అవకాశం

అనకాపల్లి నుంచి భోగాపురం వరకూ జాతీయరహదారిని అనుసంధానిస్తూ కొత్తగా రోడ్లను అందుబాటులోకి తేవడం వల్ల ట్రాఫిక్‌ను నగరం నుంచి జాతీయ రహదారిపైకి, జాతీయ రహదారి నుంచి నగరంలోకి సులభంగా మళ్లించేందుకు వీలు కలుగుతుంది. నగరంలోకి ప్రస్తుతం భారీ వాహనాలు, గూడ్సు వాహనాలు ప్రవేశించడం వల్ల తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. అదే నగరం నుంచి ఎక్కడికక్కడ జాతీయ రహదారిని అనుసంధానించే రోడ్లు అందుబాటులోకి వస్తే సమీప ప్రాంతంలో బయలుదేరే వాహనాలు అనుసంధాన రోడ్ల మీదుగా జాతీయరహదారిపైకి వెళ్లిపోతాయి. దీనివల్ల నగరంలో ట్రాఫిక్ తగ్గుతుదని అధికారులు భావిస్తున్నారు. అలాగే అనకాపల్లి, గాజువాక ప్రాంతాల నుంచి భోగాపురం వెళ్లాలనుకుంటే జాతీయ రహదారి మీదుగా వెళ్లిపోతారు కాబట్టి అటువైపు నుంచి వచ్చే ట్రాఫిక్ నగరంలో తగ్గిపోతోంది. మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా రోడ్ల నిర్మాణం, విస్తరణకు వీలుగా డీపీఆర్ తయారుచేసేందుకు వీఎంఆర్‌డీఏ ద్వారా టెండర్లు పిలవాలని మంత్రి నారాయణ ఆదేశించడంతో అధికారులు ఆ దిశగా కసరత్తు ప్రారంభించారు.

## జాబ్ స్కామ్ కేసులో మల్కాపురం వాసి అరెస్టు

... 5వ పేజీ తరువాయి

పరిచయమైంది. కంబోడియా వంటి దేశాలకు నిరుద్యోగులను పంపిస్తే మంచి కమీషన్ వస్తుందని వెంకటరాఘవ చెప్పడంతో ముగ్గురిని రమేష్ వివిధ దేశాలకు పంపించాడు. వెంకటరాఘవ కూడా కంబోడియాకు వెళ్లి కుక్‌గా స్థిరపడ్డాడు. అప్పటి నుంచి రమేష్ ద్వారా భారత్ నుంచి వచ్చిన వారిని రిసీవ్ చేసుకుని, ఫిలిప్పీన్స్‌కి చెందిన ఆర్య హబీబ్‌తో కలిసి చైనా కంపెనీలకు పంపించేవాడు. ఇలా 12 మందిని చైనా స్కామ్ కంపెనీలకు పంపాడు. ఈ కేసులో ఇప్పటికే చుక్కా రమేష్‌ను అరెస్టు చేసిన పోలీసులు పార్థసారధిపై నిఘా పెట్టారు. అతడు కంబోడియా నుంచి బ్యాంకాక్, అక్కడి నుంచి భువనేశ్వర్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడన్న సమాచారంతో అక్కడి అధికారులను అప్రమత్తం చేశారు. భువనేశ్వర్ ఎయిర్‌పోర్టు ఇమ్మిగ్రేషన్ అధికారులు బుధవారం పార్థసారధిని అడ్డుకుని, విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అతడిని అరెస్టు చేసి విశాఖ తీసుకుచ్చి, రిమాండుకు తరలించారు.

## దీపం లబ్ధిదారులకు గ్యాస్ డబ్బులు

... 5వ పేజీ తరువాయి

నాలుగో తేదీ వరకు 59,275 మందికి డెలివరీ ఇచ్చారు. మరో 70,281 మందికి సిలిండర్లు ఇవ్వాల్సి ఉంది.. అత్యధికంగా హెచ్‌పీసీఎల్ కంపెనీ...43,186 మంది సిలిండర్ బుక్ చేయగా 31,786 (73.6 శాతం) మందికి, ఆ తరువాత బీపీసీఎల్ 25,330కి గాను 14,710 (56.83 శాతం) మందికి, ఐఓసీఎల్ 35,793కు గాను 12,779 మందికి (35.7 శాతం) సిలిండర్లు డెలివరీ ఇచ్చాయి. అయితే సిలిండర్ డెలివరీ అయిన వినియోగదారులందరికీ సొమ్ములు జమ కాలేదు. సాంకేతికంగా ఇబ్బందులున్న చోట్ల పెండింగ్ చూపిస్తోంది. ఈ నేపథ్యంలో వినియోగదారుడు తమకు సిలిండర్ సరఫరా చేసే గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి ఈకేవైసీ చేసుకోవాలని డీఎస్‌వో భాస్కరరావు సూచించారు. తొలి సిలెండర్ బుక్ చేసుకునేందుకు వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు గడువు ఉందని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బహూశా రెండు, మూడు రోజుల తరువాత గ్రామ/వార్డు సచివాలయాల్లో ఈకేవైసీ సదుపాయం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.

## 'స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ ఆపాలి'

డాబాగార్డెన్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు ఎవరి దయాదాక్షిణ్యాలతో వచ్చినది కాదని, ఎంతో మంది ప్రాణత్యాగాలతో ఏర్పాటైందని సీఐటీయూ సీనియర్ నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కొనసాగిస్తున్న దీక్షల వద్దకు బుధవారం సీఐటీయూ నాయకులు విచ్చేసి సంఘీభావాన్ని ప్రకటించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా పదేళ్లుగా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వ రంగంలో కొనసాగుతున్న సంస్థలన్నీ ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం, నిజమైన దేశద్రోహం అన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, ముఠా కళాసి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## విశాఖలో ఒలింపిక్ భవన్ అవసరం: కంచరాన

విశాఖపట్నం (స్పోర్ట్సు), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడా రంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన కొత్త విధానం అద్భుతంగా ఉందని, ప్రస్తుత వర్ధమాన క్రీడాకారులతోపాటు భవిష్యత్తు తరాలను క్రీడలవైపు ఆకర్షించే విధంగా ఉందని ద ఒలింపిక్ సంఘం విశాఖ శాఖ ప్రధాన కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ హర్షం ప్రకటించారు. కొత్త విధానం ద్వారా రానున్న ఆసియా గేమ్స్, ఒలింపిక్స్, వరల్డ్ కప్, జాతీయ క్రీడల్లో పతకాలు సాధించే క్రీడాకారులను రాష్ట్రం అందించడం ఖాయమని పేర్కొన్నారు. అయితే రాష్ట్రానికి క్రీడా కేంద్రంగా రూపొందుతున్న విశాఖలో ఒలింపిక్ భవన్ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఒలింపిక్ భవన్ అందుబాటులో ఉంటే అన్ని క్రీడా సంఘాల కార్యకలాపాలకు అనుకూలంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. కోచ్‌ల కొరత వెంటాడుతోందని, వివిధ క్రీడాంశాలలో క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు అర్హత, నైపుణ్యం కలిగిన కోచ్‌లను నియమించాలని కోరారు.

# పర్యావరణంపై జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ శశిభూషణరావు తదితరులు

వెంకోజీపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఏయూ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో డిసెంబరు5 నుంచి 7 వరకు నిర్వహించను న్న నానో మెటీరియల్స్ ఫర్ ఎనర్జీ క్యాటలిసిస్ అండ్ ఎన్విరాన్‌మెంట్ జాతీయ సదస్సు పోస్టర్‌ను ఏయూ వీసీ జి.శశిభూషణరావు తన కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించా రు. డీఎస్‌టీ-పిస్ట్ పథకంలో భాగంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులో నానో మెటీరియల్స్, క్యాటలిసిస్, ఫోటో క్యాటలిసిస్, ఎన్విరాన్‌మెంటల్ రెమిడియేషన్, బయోమాస్ కన్వర్షన్ తదితర అంశాలపై నిపుణుల ప్రసంగాలు, పరిశోధనా పత్రాల సమర్పణ ఉంటాయి. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ టి.శివరావు, విభాగాచార్యులు పి.శ్యామల, బీబీవీ శైలజ, వి.సిద్ధయ్య, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారులకు ఓఎన్‌డీసీ లాభదాయక వేదిక

» జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



సమావేశంలో మాట్లాతున్న జీవీఎంసీ కమిషనర్, పాల్గొన్న ఎస్‌హెచ్‌జీ మహిళా వ్యాపారులు

వెంకోజీపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు పరుస్తున్న ఓపెన్ నెట్వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) నగరంలో గల చిన్న చిన్న వ్యాపారస్తులు, ఉత్పత్తిదారులు, ఎస్‌హెచ్‌జీ మహిళా వ్యాపారులకు ఓ లాభదాయక వ్యాపార వేదిక అని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన నగరంలో గల చిరు వ్యాపారులు, ఎస్‌హెచ్‌జీ మహిళా వ్యాపారస్తులతో ఓఎన్‌డీసీ ఆన్లైన్ వ్యాపార వేదిక వినియోగంపై జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అవగాహన సదస్సును నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓఎన్‌డీసీ ఆన్‌లైన్ వ్యాపార వేదిక దేశంలోనే మొట్టమొదటి ఓపెన్ నెట్వర్క్ మార్కెట్ ప్లేస్‌గా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఓఎన్‌డీసీ కనెక్టెడ్ మార్కెట్ ప్లేస్ అని, ఇది వ్యాపారస్తులకు, కొనుగోలుదారులకు ఒక సులభతరమైన లాభదాయకమైన వ్యాపార వేదిక అని కమిషనర్ తెలిపారు. ఇప్పటికే మెప్మా సాంకేతిక సహకారంతో ఎస్‌హెచ్‌జీ మహిళలు ఉత్పత్తి చేసిన 185 రకాల వస్తువులను ఇందులో అప్‌లోడ్ చేయడం ద్వారా వ్యాపారం జరిగిందన్నారు. ఈ వ్యాపార వేదికలో సందేహాలను నివృత్తి చేసుకునేందుకు జీవీఎంసీ మెప్మా యంత్రాం గం అందుబాటులో ఉంటుందని, ఈ విషయమై ఓఎండీసీ సాంకేతిక సహాయకులు బాలశేఖర్‌ను ఫోన్ : 63058 75089లో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీసీ డీవీ రమణమూర్తి, పీడీ యూసీడీ పీఎం సత్యవేణి, యూసీడీ ప్రాజెక్టు అధికారి డి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సింహాద్రి రెండో యూనిట్‌లో ఉత్పత్తికి అంతరాయం

పరవాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌లో ఉత్పత్తికి బుధవారం అంతరాయం ఏర్పడింది. ఇదే యూనిట్‌కు సంబంధించి బాయిలర్ ట్యూబ్‌లకు రంధ్రాలు ఏర్పడడంతో ఉత్పత్తి అర్ధాంతరంగా నిలిచిపోయింది. అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు ప్రారంభించారు. కాగా మిగతా ఒకటి, మూడు, నాలుగు యూనిట్‌ల్లో ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరుగుతున్నదని అధికారులు తెలిపారు.

## సినిమా గైడ్

● క : జగదాంబ, శ్రీరామ, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)

● లక్కీ భాస్కర్ : మెలోడి, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)

● అమరన్ : శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

● బఘీర : వెంకటేశ్వర, సంగం, కిన్నెర, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ)

● దేవర : రమాదేవి, శ్రీకన్య (గాజువాక). తాతా (తగరపువలస)

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 34, వంకాయలు (తెలుపు) 34,వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 36, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 42, బీరకాయలు 36, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 60, క్యాబేజీ 36, క్యారెట్ 68 దొండకాయలు 32, బంగాళదుంపలు 40, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 60, బరబటి 40, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 40, దోస కాయలు 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 42, కీర దోస 28, కాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడ దుంపలు 26, కంద 72, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్రరపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

| కోడిగుడ్లు (నెక్) | |
|---|---|
| (వంద - రూ.లలో) | |
| విశాఖపట్నం | 550 |
| విజయనగరం | 554 |
| శ్రీకాకుళం | 554 |

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | |
| రైతు ధర | 110 |
| ఫారం ధర | 130 |
| విత్ స్కిన్ | 230 |
| స్కిన్‌లెస్ | 240 |

## ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు


పూజలు చేస్తున్న మహిళలు

వెంకోజీపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని పీల వీధిలో గౌరీ పరమేశ్వరి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి భక్తి పాటలను ఆలపిస్తూ, భజనలు చేస్తూ గౌరీ పరమేశ్వరులను కొలిచారు.

## పారిశ్రామికవేత్త బీవీ రామారావు కన్నుమూత


రామారావు పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

వెంకోజీపాలెం, నవంబరు 6 : పారిశ్రామికవేత్త బీవీ రామారావు మంగళవారం అర్ధరాత్రి కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు. ఆయనకు భార్య సతీసావిత్రి, కుమార్తె వసంతలక్ష్మి, కుమారు బీవీ రామ్ ఉన్నారు. రామారావు పార్థివదేహాన్ని పాత వెంకోజీపాలెంలోని ఎంవీవీ రెసిడెన్సీలో ఉంచారు. రామారావు అభిమానులు, శ్రేయోభిలాషులు బుధవారం ఆయన పార్థివ దేహాన్ని సందర్శించారు. గురువారం రాజమండ్రిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు ఆయన తనయుడు బీవీ రామ్ తెలిపారు.

# కాలుష్య నియంత్రణలో హెచ్‌పీసీఎల్ సేవలు స్ఫూర్తిదాయకం

» జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్


ముడసర్లోవ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద మొక్కలు నాటుతున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, హెచ్‌పీసీఎల్ డైరెక్టర్ రంగనాథన్‌రామకృష్ణ తదితరులు

ఆరిలోవ, నవంబరు 6 : (ఆంధ్రజ్యోతి) : నగర కాలుష్య నియంత్రణను సామాజిక బాధ్యతగాతీసుకొని హెచ్‌పీసీఎల్ విశాఖ రిఫైనరీ విశేష సేవలు అందిస్తోందని జీవీఎంసీ కమిషనర్ సి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ముడసర్లోవ గార్బేజీ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద హెచ్‌పీసీఎల్ సహకారంతో రూ.88 లక్షల సీఎస్‌ఆర్ నిధులతో 26, 500 మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంగనాథన్ రామకృష్ణతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ముడసర్లోవ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద తొలుత మొక్కలను నాటారు. ఈ ఈ ప్రాంతాన్ని నందనవనంగా తయారు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ ఆర్.సోమన్నారాయణ, జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పి.శివప్రసాద్‌రాజు, పర్యవేక్షణ ఇంజనీరు గోవిందరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమర్, కార్యనిర్వాహక ఇంజనీరు దిలీప్, ఏఎంవోహెచ్ డాక్టర్ కిశోర్‌కుమార్, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు, సహాయక ఇంజనీర్లు, హెచ్‌సీఎల్ సీనియర్ మేనేజర్ కాశీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

# యువతతో సామాజిక చైతన్యం పెంపొందించాలి

» ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారావు


మాట్లాడుతున్న ప్రొఫెసర్ నరసింహారావు

వెంకోజీపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : యువతలో సామాజిక చైతన్యం పెంపొందించేలా జాతీయ సేవాపథకం ప్రోగ్రాం అధికారులు పనిచేయాలని ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు అన్నారు. బుధవారం ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ సమావేశ మందిరంలో హెరిటేజ్ ఫౌండేషన్‌తో సంయుక్తంగా ప్రోగ్రాం అధికారులకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ యువత వైఖరులను మార్పు చేసే విధంగా కార్యక్రమాలు నిర్వహించడం అవసరమని చెప్పారు. జాతీయ సేవా పథకం సమన్వయకర్త ఎస్.హరనాథ్ మాట్లాడుతూ వృద్ధులు శారీరక, మానసిక వేధింపులకు గురికాకుండా చూడాలన్నారు. హెరిటేజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎన్‌ఆర్ గంగాధరన్ మాట్లాడుతూ ఒకరిని మరొకరు అర్థం చేసుకుంటే సమస్యను పరిష్కరించడం సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా సమన్వయకర్తలు ఈపీఎస్ భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్‌పాల్గొన్నారు.

# ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ యాప్ వినియోగంపై ఆర్పీలకు శిక్షణ


జ్యోతి ప్రజల్వన చేసి వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

సిరిపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆర్పీలు ఒక శక్తిగా ఉండాలని, స్లమ్‌లో మార్పు తెచ్చేలా విధులు నిర్వహించాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం గురజాడ కళాక్షేత్రంలో ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ యాప్ వినియోగం, విధి విధానాలపై జీవీఎంసీ స్థాయిలో ఆర్పీలకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనపై చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఆ దిశగా ఈ ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ యాప్‌ను ఈ నెల 31లోగా పూర్తి వివరాలతో నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రధానంగా ఆర్పీలు వారి పరిధిలో ప్రతి ఇంట రోజూ ఉత్పత్తి అయ్యే వ్యర్థాల విభజన, సేకరణ, తరలింపు, రోడ్ల పరిశుభ్రత, కాలువలలో వ్యర్థాలు పేరుకుపోకుండా గమనించి వాటిని నిర్ణీత సమయంలో పరిశుభ్రత దిశగా మార్పుకు సహకరించాలన్నారు. ఖర్చుల అదుపు, పిల్లల చదువులు వంటి అంశాలపై అవ గాహనకలిగించాలన్నారు. ఏడీసీ డీవీ రమణమూర్తి, పీడీ యూసీడీ పీఎం సత్యవేణి, ప్రాజెక్టు అధికారులు, డిప్యూటీ ప్రాజెక్టు అధికారులు, మెప్మా, యూసీడీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గౌరీపరమేశ్వరుల ఉత్సవాలకు ఆహ్వానం


ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

వెంకోజీపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డులోని పాత వెంకోజీపాలెం శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి స్థానిక రామాలయంలో నిర్వహించనున్న గౌరీ పరమేశ్వరి నవరాత్రి ఉత్సవాలకు కేంద్ర గౌరీ సంఘానికి ఆహ్వాన పత్రికను బుధవారం సాయంత్రం అందజేశారు. గవర కులస్థులు నిర్వహించుకునే ఈ ఉత్సవంలో కేంద్ర గౌరీ సంఘం నుంచి సభ్యులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఆడారి పరదేశినాయుడు, కోశాధికారి పొలమరశెట్టి త్రినాథ్, ఆడిటర్ మళ్ల రవికుమార్ పాల్గొన్నారు.

# రైల్వేస్టేషన్లలో డిజిటల్ చెల్లింపులు

» ప్రత్యేక డ్రైవ్‌లతో ప్రయాణికులకు అవగాహన


డిజిటల్ చెల్లింపులను పరిశీలిస్తున్న సీనియర్ డీసీఎం కె.సందీప్

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ ఇండియాలో భాగంగా వాల్తేరు డివిజన్‌లోని అన్ని స్టేషన్లలో క్యూ ఆర్ కోడ్ డిజిటల్ చెల్లింపులు విస్తృతం చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. డిజిటల్ చెల్లింపు విధానం ఆగస్టులో ప్రవేశపెట్టినా ప్రయాణికులకు పూర్తి అవగాహన కల్పించలేదు. ఇప్పుడు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టి డిజిటల్ చెల్లింపులు విస్తృతం చేయడంతోపాటు ప్రత్యేక డ్రైవ్‌లతో అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో పాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ (పీఆర్‌ఎస్), అన్ రిజర్వ్ టికెట్ సిస్టమ్ (యుటీఎస్) కేంద్రాల్లో క్యూ ఆర్ కోడ్ ద్వారా టికెట్ రుసుములు చెల్లించవచ్చునని తెలిపారు. వాల్తేరు డివిజన్ పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్లలో ఈ సదుపాయం అందుబాటులోకి తీసుకువచ్చామని, ఫోన్ పే, గూగుల్ పే, ఇతర ప్రసిద్ద యూపీఐ యాప్‌లతో సులభంగా టికెట్ రుసుము చెల్లించవచ్చునని సందీప్ పేర్కొన్నారు. డిజిటల్ చెల్లింపుల ద్వారా ప్రయాణికుల సమయం ఆదా అవుతుందని, క్యూ లైనులో నిలబడాల్సిన అవసరం లేకుండా పేపర్ లెస్ టికెట్ పొందవచ్చునని పేర్కొన్నారు. ప్రయాణికులు అవగాహన పెంచుకుని టికెట్ చెల్లింపు లావాదేవీలు సులభంగా పూర్తి చేసుకోవచ్చునని డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ పేర్కొన్నారు.

# వృద్ధుల ప్రాధాన్యం వివరిస్తూ బీచ్‌రోడ్డులో వాక్‌థాన్


బీచ్‌రోడ్డులో వాక్‌థాన్ నిర్వహిస్తున్న దృశ్యం

రామ్‌నగర్, నవంబరు 6 : (ఆంధ్రజ్యోతి) : సమాజంలో వృద్ధుల ప్రాధాన్యతను గుర్తించాలని హెరిటేజ్ ఫౌండేషన్ ఇండియా చైర్మన్ డాక్టర్ కెఆర్ గంగాధరన్ పేర్కొన్నారు. సమాజంలో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను తెలియజేస్తూ వారి ఆవశ్యకతను సమాజానికి చాటిచెప్పేందుకు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ, హెరిటేజ్ ఫౌండేషన్, ఆర్‌ఆర్‌టీసీ ఏయూ జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) సంయుక్త ఆధ్వర్యంలో బుధ వారం బీచ్‌రోడ్డులో వాక్‌థాన్ నిర్వహించారు. బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు ఈ వాక్‌థాన్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ సమాజంలో వృద్ధులకు తగిన గౌరవా న్ని కల్పించడం, భద్రతను ఇవ్వడం ఎంతో అవసరమన్నారు. నేడు సమాజంలో వృద్ధులు, యువతకు మధ్య దూరం పెరుగుతోందని, ఇది ఎంతమాత్రం వాంచనీయం కాదన్నా రు. యాంత్రిక జీవనంలో వృద్ధులకు తగిన గుర్తింపు లభించడం లేదని అన్నారు దేశవ్యాప్తంగా వృద్ధుతు ఎదుర్కోంటున్న విభిన్న సమస్యలకు పరిష్కారం చూపడం మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎస్.హరనాథ్, జాతీయ సేవా పథకం వలంటీర్లు, హెరిటేజ్ ఫౌండేషన్ ప్రతినిదులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


# ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్న ప్రభుత్వాలు : సీపీఎం నేత పద్మ


సమావేశంలో మాట్లాడుతున్న పద్మ

ఆరిలోవ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై పెను ఆర్థిక భారాన్ని వేసేందుకు సిద్ధం అవుతున్నాయని, మరోవైపు విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వేగవంతం చేస్తూ గుబురు పుట్టిస్తున్నాయని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు బి.పద్మ వివరించారు. మద్దిలపాలెం, ఆరిలోవ, మధురవాడ జోన్లు మద్దిలపాలెం జోన్‌గా ఆరిలోవ ఎర్నిదుర్గమాంబ కల్యాణ మండపంలో సీపీఎం 8వ మహాసభ బుధవారం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ రెడ్డిపల్లి బాబూరావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడిన పద్మ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు.ప్రజాపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.













## జాబ్ మేళా రేపు

కంచరపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐని ఆనుకుని ఉన్న నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్ వద్ద ఈ నెల 8న నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా ఏర్పాటు చేస్తున్నట్టు ఉప ఉపాధి కల్పన అధికారి శ్యాంసుందర్ నిట్టల తెలిపారు. మేళాలో నవత ట్రాన్స్‌పోర్ట్ సంస్థ, ఏషియన్ ఆటో పార్ట్సు ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థలు పాల్గొని 75 ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా కోర్సులు పూర్తిచేసిన యువత హాజరుకావచ్చు. ఎంపికైన వారికి నెలకు రూ.10వేలు నుంచి రూ.15 వేలు చెల్లిస్తారు. అభ్యర్థులు ముందుగా నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలి. ఆసక్తి, అర్హత గల నిరుద్యోగులు 8న ఉదయం 9 గంటలకు బయోడేటా, అర్హత ధ్రువపత్రాలతో హాజరుకావాలని శ్యాంసుందర్ సూచించారు.

### బాలల దినోత్సవం పోస్టర్ విడుదల

డాబాగార్డెన్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాల్యం చాలా విలువైనదని, ఆ అనుభూతి పిల్లలకు అందించడం మనందరి బాధ్యత అని వీసీసీ వ్యవస్థాపకులు రమాప్రభ పేర్కొన్నారు. బుధవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలోని ఇంటరాక్ట్ క్లబ్స్ ఆఫ్ వీసీసీ బాలల దినోత్సవం-2024 పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైజాగ్ చిల్డ్రన్ క్లబ్, రోటరీ క్లబ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఇంటరాక్ట్ క్లబ్స్‌లో ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు క్లబ్స్‌లో బాలల దినోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది సర్వీసు అబౌ సెల్ఫ్ అనే థీమ్‌తో క్లబ్ లీడర్లు, వాలంటీర్లు బాలల కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తాయన్నా రు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ గాంధీ, ఎల్లాజీ, సునీత, భవాని, మణి తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ నిజాయితీ



పోలీసుల సమక్షంలో ఉంగరం అప్పగిస్తున్న ఆటో డ్రైవర్ దేముడు బాబు

అక్కయ్యపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తన ఆటోలో దొరికిన బంగారు ఉంగరాన్ని ఆటో డ్రైవర్ నిజాయితీగా ట్రాఫిక్ పోలీసుల సమక్షంలో పోగొట్టుకున్న వ్యక్తికి బుధవారం అప్పగించారు. గోల్డెన్ జూబ్లీ ఆటో స్టాండ్ డ్రైవర్ దేముడుబాబుకు తన ఆటోలో ప్రయాణించిన వ్యక్తికి చెందిన అరతులం బంగారు ఉంగరం దొరికింది. డ్రైవర్ నిజాయితీగా నాల్గో పట్టణ ట్రాఫిక్ ఎస్సై వాణిశ్రీ, ఏఎస్సై రమణ ఆధ్వర్యంలో పోగొట్టుకున్న వ్యక్తికి ఆ ఉంగరాన్ని అప్పగించారు. దీంతో ఆటో డ్రైవర్‌ను పోలీసులు అభినందించారు.

## గౌరీపరమేశ్వర ఉత్సవాలకు రాటమహోత్సవం



రాట మహోత్సవంలో పాల్గొన్న సంఘం ప్రతినిధులు

కంచరపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం మెట్టు నుంచి సిద్ధార్థనగర్ వరకు గౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు బుధవారం ఘనంగా రాటమహోత్సవం చేశారు. ఏటా ఇక్కడ కార్తీకమాసంలో ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కుంకుమ పూజలు, అభిషేకాలు, అమ్మవారి సారె ఊరేగింపు తదితర ఘట్టాలను వైభవంగా చేపట్టనున్నట్టు కమిటీ గౌరవాధ్యక్షుడు కె.సూర్యనారాయణ, అధ్యక్షుడు ఆళ్ల లక్ష్మీనారాయణ, కార్యదర్శి రామప్పడు తెలియజేశారు. రాట మహోత్సవంలో 57వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పెంటకోట అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### 'నైపుణ్య సర్వేకు సహకరించండి'

అల్లిపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యువతలో ఉన్న వాస్తవిక నైపుణ్యాలను గుర్తించి వారికి అవసరమైన నైపుణ్యాభివృద్ధిని అందించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లు సంకల్పించారు. వారి ఆదేశాల మేరకు జోన్-4 పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న యువతపై నైపుణ్య సర్వే నిర్వహిస్తున్నామని జోన్-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయడు తెలియజేశారు. ఈ సర్వే కోసం వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కుటుంబ సభ్యులకు మానసిక రోగి అప్పగింత

అక్కయ్యపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న బెంగళూరుకు చెందిన వెంకట రమణను అతని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఆరు నెలల క్రితం విశాఖ రైల్వేస్టేషన్‌లో దిక్కుతోచని స్థితిలో ఉండగా ఏయూటీడీ సిబ్బందితో వెళ్లి తీసుకొని వచ్చి ఆశ్రయం కల్పించినట్లు చెప్పారు. ఆయన హరే యన బాబా మందిరానికి వెళ్లాలని రోజూ గొడవ చేసేవారన్నారు. అభద్రతా భావంతో ఉంటూ ఎవరినీ నమ్మేవారు కాదని పేర్కొన్నారు. పదేళ్లుగా మానసిక రుగ్మతతో బాధపడుతూ మందులు వాడకపోవడంతో వ్యాధి తీవ్రత పెరిగిందన్నారు. శ్రద్ధా టీం చికిత్స మందుల వల్ల వ్యాధి నయమైంది. అతని కుమారుడి చిరునామా చెప్పడంతో వెంకటరమణను బెంగళూరులోని అతని కుమారుడు శ్రావణ్‌కుమార్ కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు చెప్పారు.

# కర్నూలు ఉల్లికి డిమాండ్



సీతమ్మధార రైతుబజార్‌లో విక్రయిస్తున్న చిన్న ఉల్లిపాయలు

సీతమ్మధార, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత రెండు, మూడు నెలలుగా ఉల్లి, టమాటా ధరలు కొండెక్కి కూర్చున్నాయి. దాదాపు అన్ని నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినా, రోజూ ఎక్కువగా అవసరమయ్యే ఉల్లి, టమాటా ధరలు మంటెక్కడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీన్ని గమనించిన ప్రభుత్వం రాయితీపై రైతు బజార్లలో తొలుత ఉల్లి, ఆ తరువాత టమాటా విక్రయాలు ప్రారంభించింది. టమాటా ధర కొంతమేర తగ్గినా, ఉల్లిఘాటు స్థిరంగా ఉంది. బయట మార్కెట్‌లో ఈ రెండింటి ధరలు కిలో అరవై పైమాటే. రైతు బజార్లలో పెద్దసైజు ఉల్లి రూ.52 నుంచి రూ.55 వరకు ఉండగా, టమాటా రూ.43 వద్ద ఉంది. తోపుడుబండ్లపై వీధుల్లో తిరిగి విక్రయించేవారు సైతం ధరలు మండిపోతున్నాయని భావించి తక్కువ ధరకు లభ్యమయ్యే సరకునే తీసుకొస్తున్నారు. ఈ తరుణంలో గత పదిహేను రోజుల నుంచి కర్నూలు నుంచి చిన్న ఉల్లిపాయలు రావడంతో వీటిని కొనుగోలు చేయడానికి ప్రజలు మొగ్గు చూపుతున్నారు. సీతమ్మధార రైతుబజార్‌లో వీటి కోసం ఎగబడుతున్నారు. దీంతో కౌంటర్‌ల వద్ద రద్దీ పెరిగింది. దీపావళి, నాగుల చవితి పండుగల సందర్భంగా ఉత్తరాదిలో సెలవులు తీసుకోవడంతో లారీల్లో రవాణా జరగక ఎగుమతి, దిగుమతులు నిలిచిపోయాయి. దీంతో అక్కడి నుంచి ఉల్లిపాయలు ఇక్కడి టోకు (హోల్‌సేల్) మార్కెట్‌కు తక్కువగా వస్తున్నాయి. మహారాష్ట్ర నుంచి వస్తున్న ఉల్లిపాయలు కిలో రూ.58, సోలాపూర్ ఉల్లి కిలో రూ.52, కర్నూలు నుంచి వచ్చిన చిన్న ఉల్లిపాయలు కిలో రూ.36 ధర ఉండటంతో కర్నూలు ఉల్లి కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. చిన్న ఉల్లిపాయలైనా ఘాటుగా ఉంటున్నాయని చెబుతున్నారు. కార్తీక మాసంలో చాలామంది ఆహార పదార్థాల్లో ఉల్లి వాడరు. ఇలాంటి తరుణంలో అయినా ధరలు సాధారణ స్థితికి వస్తాయనుకుంటే ఏమాత్రం మార్పు లేదు. రైతుబజార్‌లో రెండు రకాలు ఉన్నప్పటికీ, చిన్న ఉల్లిపాయల వద్దకే అందరూ ఎగబడుతున్నారు. తోపుడు బళ్ల వ్యాపారులు సైతం చిన్న ఉల్లినే విక్రయిస్తున్నారు. తెల్ల ఉల్లి (వెల్లుల్లి) ధర ఇంకా కొండెక్కి కూర్చోవడంతో ప్రజలు నిట్టూరుస్తున్నారు.

## రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, జడ్పీ, కార్పొరేటర్ తదితరులు

జ్ఞానాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా గతుకుల రోడ్డుతో ఇబ్బందులు పడుతున్న గ్రేటర్ 41వ వార్డు సెబాస్టియన్ కాలనీ వాసులకు ఎట్టకేలకు ఎమ్మెల్యే వంశీకృష్ణ, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా చొరవతో ఇబ్బందులు తొలగనున్నాయి. స్థానికుల విజ్ఞాపనలు, పత్రికల్లో కథనాలతో స్పందించిన ఇంజనీరింగ్ అధికారులు బుధవారం రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమాతో కలసి రూ.19 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బి.రాము, ఏఈ సతీష్, కోడిగుడ్ల శ్రీధర్, వార్డు కూటమి అధ్యక్షులు ఐతి మధుబాబు, అంతోని శేఖర్, సంజీవరావు, కూటమి నాయకులు ఐతి రవిబాబు, కర్రి బానోజీరావు, గవర రమణ, పిల్లి గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

## చిరుధాన్యాలతో ట్రంప్ చిత్రపటం



విజయచిహ్నం చూపుతున్నట్లుగా రూపొందించిన ట్రంప్ చిత్రపటం

డాబాగార్డెన్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అమెరికా అధ్యక్షునిగా డోనాల్డ్ ట్రంప్ రెండోసారి ఎన్నికైన సందర్భాన్ని పురస్కరించుకొని విశాఖకు చెందిన చిత్రకారుడు మోకా విజయకుమార్ చిరుధాన్యాలతో ట్రంప్ చిత్రపటాన్ని సహజసిద్ధంగా తయారు చేశారు. విజయ చిహ్నాన్ని చూపుతున్నట్టుగా, ట్రంప్ చిత్రం వెనుక భాగంలో అమెరికా జెండాను సైతం తీర్చిదిద్దారు. భారత అమెరికా సంబంధాలు మరింత బలోపేతం కావాలని మనసారా కోరుకుంటూ ఈ విధంగా అమెరికా అధ్యక్షునికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్టు విజయకుమార్ చెప్పారు.

### జెడ్పీ సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు

మహారాణిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్‌లో ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లకు పరిపాలనా అధికారులుగా పదోన్నతులు కల్పించారు. వీరిలో ఎన్‌వీహెచ్‌ఆర్ స్వామి రావికమతం మండలం, వీఆర్ రాజేశ్వరి విశాఖ జిల్లా పరిషత్‌కు, వేణుగోపాల్‌ను డుంబ్రిగూడ మండల పరిపాలనాధికారులుగా నియమించారు. జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, సీఈవో పి.నారాయణమూర్తి వీరికి పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆదాయం పెంపునకు ప్రణాళికలు

» ముఖ్య నగరాల్లో కన్వెన్షన్ సెంటర్ల ఏర్పాటు

» ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వి.బాబూరావు



సమావేశంలో మాట్లాడుతున్న వజ్జ బాబూరావు

మద్దిలపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆదాయం పెంపునకు పటిష్ఠ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు తెలిపారు. పిఠాపురం కాలనీ జనశిక్షణ సంస్థాన్ భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం నుంచి నిధులు తెచ్చుకోవడంతో పాటు తమ సంస్థకున్న ఆస్తులు, వ్యాపారాల ద్వారా ఆదాయం వృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కార్పొరేషన్‌కు ఆస్తులు ఉండేవని, విభజన తర్వాత సంస్థ కార్యకలాపాలు తగ్గాయన్నారు. ప్రస్తుతం కార్పొరేషన్‌కు రాష్ట్రంలో ఉన్న ఆస్తులు పరిశీలిస్తున్నామన్నారు. కార్పొరేషన్‌కు రాష్ట్ర బడ్జెట్ ఉండదని, కేంద్రమే నిధులు కేటాయించాల్సి ఉంటుందన్నారు. నగరంలోని నగరంలో రేసపువానిపాలెంలో 2.5 ఎకరాలను స్పెన్సర్ సంస్థ లీజుకు తీసుకుందని, గాజువాకలో 3.5 ఎకరాల్లో ఎగుమతి గిడ్డంగి ఉందన్నారు. అమరావతి, విశాఖ, తిరుపతి నగరాల్లో కన్వెషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఆరు నెలలకోసారి ట్రేడర్స్‌కు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. సంస్థలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి కృషి చేస్తామన్నారు. కార్పొరేషన్ జనరల్ మేనేజర్ హనుమా నాయక్ మాట్లాడుతూ సంస్థ ద్వారా లేపాక్షి, నంది బ్రాండ్ పేరుతో నోటు పుస్తకాలు విక్రయిస్తున్నామన్నారు. ప్రభుత్వ శాఖలకు సిమెంట్ సరఫరా చేస్తున్నామన్నారు. కార్పొరేషన్‌కు పూర్వ వైభవం తెచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## మిస్టర్ ఆంధ్ర యూనివర్సిటీగా గోపీచంద్





శరీర సౌష్టవ ప్రదర్శన ఇస్తున్న గోపీచంద్‌తో అతిథులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏయూ అంతర్ కళాశాలల దేహదారుఢ్య పోటీల్లో మిస్టర్ ఆంధ్ర విశ్వవిద్యాలయం టైటిల్‌ను బుల్లయ్య కళాశాల విద్యార్థి గోపీచంద్ కైవసం చేసుకున్నాడు. కళాశాలలో జరిగిన ఈ టోర్నీలో గోపీచంద్ అద్భుతమైన ప్రతిభ కనబరిచి బెస్ట్ ఫిజిక్ ట్రోఫీని సొంతం చేసుకున్నాడు. అలాగే ఇక్కడ జరిగిన ఏయూ అంతర్ కళాశాలల పురుషుల మహిళల వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లోనూ బుల్లయ్య కళాశాల విద్యార్థులు పతకాలు సాధించి చాంపియన్ ట్రోఫీలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కాలేజి యాజమాన్యం, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, గంగాభవానితదితరులు అభినందించారు.

### పోలీసులకు యోగా శిక్షణ



యోగా సాధన చేస్తున్న పోలీసులు

జగదాంబ కూడలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యం, బుద్ధికుశలత, మానసిక ప్రశాంతత లభిస్తుందని విశ్వసించిన వన్‌టౌన్ సీఐ దేముడు బాబు తమ పోలీస్ స్టేషన్ సిబ్బందికి యోగా శిక్షణ ఇప్పిస్తున్నారు. వయసు మీరుతున్నా, ప్రజాసేవలో ఉన్న పోలీసులు నిత్యం చురుగ్గా ఉండేందుకు యోగా సాధన ఒక మార్గంగా ఆయన భావించారు. బుధవారం ఉదయం తమ స్టేషన్ సిబ్బందికి సెంట్ ఎలాసిస్ స్కూల్ ప్రాంగణంలో యోగా తరగతులు ఏర్పాటు చేశారు. యోగాతో తన సిబ్బంది మరింత ఉత్తేజంగా పనిచేస్తారనేది సీఐ ఆలోచన. యోగా తరగతులు పూర్తయిన తరువాత పోలీస్ సిబ్బందికి స్వయంగా అల్పాహారాన్ని ఆయన ఏర్పాటు చేయడం విశేషం.

## రైల్వేస్టేషన్లలో డిజిటల్ చెల్లింపులు

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్‌లోని అన్ని స్టేషన్లలో క్యూ ఆర్ కోడ్ డిజిటల్ చెల్లింపులు విస్తృతం చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ విధానం ఆగస్టులో ప్రవేశపెట్టినా ప్రయాణికులకు పూర్తి అవగాహన కల్పించలేదు. ఇప్పుడు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టి ప్రత్యేక డ్రైవ్‌లతో అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో పాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ (పీఆర్ఎస్), అన్ రిజర్వ్ టికెట్ సిస్టమ్ (యుటీఎస్) కేంద్రాల్లో క్యూ ఆర్ కోడ్ ద్వారా టికెట్ రుసుములు చెల్లించవచ్చునని తెలిపారు. వాల్తేరు డివిజన్ పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్లలో ఈ సదుపాయం అందుబాటులోకి తీసుకువచ్చామని, ఫోన్ పే, గూగుల్ పే, ఇతర ప్రసిద్ధ యూపీఐ యాప్‌లతో సులభంగా టికెట్ రుసుము చెల్లించవచ్చునని సందీప్ పేర్కొన్నారు. డిజిటల్ చెల్లింపుల ద్వారా ప్రయాణికుల సమయం ఆదా అవుతుందని, క్యూ లైనులో నిలబడాల్సిన అవసరం లేకుండా పేపర్ లెస్ టికెట్ పొందవచ్చునని పేర్కొన్నారు. ప్రయాణికులు అవగాహన పెంచుకుని టికెట్ చెల్లింపు లావాదేవీలు సులభంగా పూర్తి చేసుకోవచ్చునని డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ పేర్కొన్నారు.

# నూతన విధానంతో క్రీడా రంగానికి ఉత్తేజం

» ఎమ్మెల్యే గణబాబు



అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు శాసనసభ్యుడు గణబాబు

విశాఖపట్నం (స్పోర్ట్సు), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన నూతన క్రీడా విధానాలు రాష్ట్రంలోని ఔత్సాహిక క్రీడాకారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తాయని అంతర్జాతీయ వాలీబాలర్, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు గణబాబు ఆశాభావం వ్యక్తంచేశారు. అందరికీ క్రీడలు అనే విధానంతో రూపొందించిన నాలుగు విధానాలు దేశ క్రీడారంగంలో రాష్ట్రాన్ని ప్రధాన కేంద్రంగా నిలబెట్టడం ఖాయమన్నారు. జీవనోపాధి లక్ష్యంగా సాధన చేసేవారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వ సంస్థలలో క్రీడా కోటా నియామకాలను రెండు నుంచి మూడు శాతానికి పెంచడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఒలింపిక్స్, ఆసియా, ప్రపంచ, జాతీయ క్రీడల్లో పతకాలు సాధించేవారికి అందించే నగదు ప్రోత్సాహాలను భారీగా పెంచడం విశేషమన్నారు. ఒలింపిక్స్‌లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలకు వరుసగా రూ.7, రూ.5, రూ.3 కోట్లు ప్రకటించి ఒలింపిక్స్ స్థాయిని పెంచారని పేర్కొన్నారు. ఆసియా క్రీడల్లో పతకాలు సాధించేవారికి రూ.4 కోట్లు, రూ.2 కోట్లు, రూ.కోటి, ప్రపంచ క్రీడల పతకాలు సాధించినవారికి రూ.50 లక్షలు, రూ.35 లక్షలు, రూ.25 లక్షలు, జాతీయ క్రీడల్లో పతక సాధకులకు రూ.2.5, రూ.2 లక్షలు, రూ.లక్ష చొప్పున నగదు ప్రోత్సాహాలు అందించే పాలసీలు తీసుకురావడం విశేషమన్నారు. ప్రభుత్వ క్రీడా ప్రాంగణాలు ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసే విధానాలకు చెక్ పెట్టడం, రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా అకాడమీలు ఏర్పాటు చేయడం, క్రీడా ప్రాంగణాలు నిర్మించాలని నిర్ణయాలు తీసుకోవడంతో రాష్ట్రం నుంచి ఉన్నత స్థాయి క్రీడాకారులు రూపొందుతారని అభిప్రాయపడ్డారు.

## ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి: కలెక్టర్

మహారాణిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాస యోజనలో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణంలో మరింత పురోగతి సాధించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రోజుకు 150 నిర్మాణాలు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను నిర్దేశించారు ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి, ఇసుక సరఫరా, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై బుధవారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. లేఅవుట్‌ల వారీగా సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను సమన్వయంతో పరిష్కరించుకొని ముందుకు వెళ్లాలన్నారు.

## మత్స్య శాఖ జేడీగా లక్ష్మణరావు బాధ్యతల స్వీకారం

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా మత్స్య శాఖ జాయింట్ డైరక్టర్‌గా లక్ష్మణరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చి ఇప్పటివరకు జేడీగా పనిచేసిన విజయ తిరిగి కాకినాడకు వెళ్లిపోయారు.

## ఎన్ఐఓ పనుల్లో కదలిక

... 5వ పేజీ తరువాయి

బ్లాకుల్లో భవనాలు వస్తాయి. కొండపైకి ప్రస్తుతం రహదారి వేస్తున్నారు.

**పరిశోధనలు:** తూర్పు తీరంలో సముద్ర తీరాన నిర్మితమవుతున్న తొలి ఎన్ఐఓ కేంద్రం ఇదే. ఎదురుగా ఉన్న సముద్రం నుంచి నేరుగా లేబొరేటరీకి అవసరమైనంత నీరు వచ్చే ఏర్పాట్లు ఉంటాయి. సముద్ర జలాల్లో సంభవించే అన్ని మార్పులను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నివేదికలు తయారుచేస్తారు. అవసరమైనప్పుడు ముందస్తు సమాచారం, హెచ్చరికలు అందజేస్తారు. సముద్ర నీటిమట్టం పెరుగుదల, కాలుష్యం హెచ్చుతగ్గులు, అంతర్భాగంలో జరిగే మార్పులు అన్నీ ఇక్కడ అధ్యయనం చేస్తారు.

## ఉక్కుపై ద్వంద్వ వైఖరి

... 5వ పేజీ తరువాయి

ఉపయోగించాలని షరతు పెట్టింది. అంటే ఈ చేత్తో ఇచ్చి ఆ చేతితో తీసేసుకుంది. రెండో విడత ఇచ్చిన రూ.1,150 కోట్లలో కూడా చట్టబద్ధమైన చెల్లింపులు పూర్తిచేసి, మిగిలిన మొత్తం బ్యాంకులకు జమ చేసి, బొగ్గుకు అవసరమైన క్రెడిట్ లెటర్లు ఇప్పించారు. దీని వల్ల రెండో బ్లాస్ట్ ఫర్నేస్ మాత్రమే అదనంగా వినియోగంలోకి వచ్చింది. మూడో బ్లాస్ట్ ఫర్నేస్, దాని ముడి పదార్థాల గురించి ఎవరూ మాట్లాడడం లేదు. ఉత్పత్తి 100 శాతం జరిగినప్పుడే లాభాలు వస్తాయి. మూడింటిలో రెండు బ్లాస్ట్ ఫర్నేసులు నడుపుతూ సెయిల్‌కు దీటుగా లాభాలు తేవాలని చెబుతున్నారు. సెయిల్‌లో ఉత్పత్తి సామర్థ్యం-ఉద్యోగుల సంఖ్య ఆధారంగా ఇక్కడ కూడా సిబ్బందిని సమకూర్చాలని కోరితే...అదనపు నియామకాలు చేపట్టకపోగా ఉన్న వారినే డిప్యుటేషన్‌పై పంపించేస్తున్నారు. ఉద్యోగుల కారణంగానే నష్టాలు వస్తున్నాయని ముద్ర వేయడానికి పెద్ద స్థాయిలో కుట్ర చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకుంటున్న ఇన్‌చార్జి సీఎండీని తక్షణమే ఇక్కడి నుంచి పంపించి, ఆ స్థానంలోకి గతంలో పనిచేసి ప్లాంటును లాభాల్లోకి తెచ్చిన బీఎన్ సింగ్‌ను స్పెషల్ ఆఫీసర్‌గా తేవాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

# ట్రాఫికర్‌కు చెక్!

... 5వ పేజీ తరువాయి

గుర్తించారు. ప్రస్తుతం ఉన్న ఎయిర్‌పోర్టు నుంచి కొత్తగా నిర్మిస్తున్న భోగాపురం ఎయిర్‌పోర్టుకు కారులో వెళ్లడానికి అధికారులకే 1.15 గంటలు సమయం పట్టింది. అదే అనకాపల్లి నుంచి వచ్చేవారికి 2.30 గంటలు పట్టే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. దీని వల్ల ప్రయాణికులు ఎయిర్‌పోర్టుకు వెళ్లడానికి ఇబ్బందిపడే అవకాశం ఉంటుంది. కాబట్టి, అనకాపల్లి నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకూ ఎక్కడికక్కడ జాతీయ రహదారిని అనుసంధానం చేసేలా 15 రోడ్లను అభివృద్ధి చేయడం ద్వారా సమస్యకు చెక్ పెట్టవచ్చునని అధికారులు గుర్తించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొమ్మాదిలోని శివశక్తినగర్ నుంచి హరిత ప్రాజెక్టు రోడ్డు, బోయపాలెం జంక్షన్ నుంచి మంగమారిపేట, పరదేశిపాలెం జంక్షన్ నుంచి గంభీరం, దొరతోట జంక్షన్-కుమ్మరిపాలెం, మూలకుద్దు-నేరెళ్లవలస, నేరెళ్లవలస-తాళ్లవలస, గండిగుండం-కొత్తవలస, తగరపువలస-మూలకుద్దు, చిప్పాడ-దివీస్ రోడ్డు, బొడ్డవలస-విజయనగరం, మోపాడ-నవరవిల్లి, అడవివరం-గండిగుండం, పినగాడి-వేపగుంట, వేపగుంట-జుత్తాడ రోడ్లను బాగా విస్తరించేలా మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించారు. జీవీఎంసీ పరిధిలో రోడ్ల విస్తరణకు తీసుకునే భూమికి టీడీఆర్ జారీచేసేలా, అనకాపల్లి, విశాఖ, విజయనగరం జిల్లాల పరిధిలోని రోడ్ల విస్తరణకు తీసుకునే భూమికి యజమానులకు పరిహారం అందించాలని అధికారులు మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచారు. విస్తరించాలని ప్రతిపాదించిన 15 రోడ్ల నిర్మాణానికి రూ.404 కోట్లు అవసరం అవుతుందని అధికారులు అంచనా వేశారు. అందులో రూ.220 కోట్లు వీఎంఆర్‌డీఏ, రూ.120 కోట్లు జీవీఎంసీ, 64 కోట్లు రోడ్లు, భవనాల శాఖ భరించాల్సి ఉంటుంది.

**ఎక్కడికక్కడ వాహనాల మళ్లింపునకు అవకాశం**

అనకాపల్లి నుంచి భోగాపురం వరకూ జాతీయరహదారిని అనుసంధానిస్తూ కొత్తగా రోడ్లను అందుబాటులోకి తేవడం వల్ల ట్రాఫిక్‌ను నగరం నుంచి జాతీయ రహదారిపైకి, జాతీయ రహదారి నుంచి నగరంలోకి సులభంగా మళ్లించేందుకు వీలు కలుగుతుంది. నగరంలోకి ప్రస్తుతం భారీ వాహనాలు, గూడ్సు వాహనాలు ప్రవేశించడం వల్ల తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. అదే నగరం నుంచి ఎక్కడికక్కడ జాతీయ రహదారిని అనుసంధానించే రోడ్లు అందుబాటులోకి వస్తే సమీప ప్రాంతంలో బయలుదేరే వాహనాలు అనుసంధాన రోడ్ల మీదుగా జాతీయరహదారిపైకి వెళ్లిపోతాయి. దీనివల్ల నగరంలో ట్రాఫిక్ తగ్గుతుదని అధికారులు భావిస్తున్నారు. అలాగే అనకాపల్లి, గాజువాక ప్రాంతాల నుంచి భోగాపురం వెళ్లాలనుకుంటే జాతీయ రహదారి మీదుగా వెళ్లిపోతారు కాబట్టి అటువైపు నుంచి వచ్చే ట్రాఫిక్ నగరంలో తగ్గిపోతోంది. మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా రోడ్ల నిర్మాణం, విస్తరణకు వీలుగా డీపీఆర్ తయారుచేసేందుకు వీఎంఆర్‌డీఏ ద్వారా టెండర్లు పిలవాలని మంత్రి నారాయణ ఆదేశించడంతో అధికారులు ఆ దిశగా కసరత్తు ప్రారంభించారు.

## జాబ్ స్కామ్ కేసులో మల్కాపురం వాసి అరెస్టు

... 5వ పేజీ తరువాయి

పరిచయమైంది. కంబోడియా వంటి దేశాలకు నిరుద్యోగులను పంపిస్తే మంచి కమీషన్ వస్తుందని వెంకటరాఘవ చెప్పడంతో ముగ్గురిని రమేష్ వివిధ దేశాలకు పంపించాడు. వెంకటరాఘవ కూడా కంబోడియాకు వెళ్లి కుక్‌గా స్థిరపడ్డాడు. అప్పటి నుంచి రమేష్ ద్వారా భారత్ నుంచి వచ్చిన వారిని రిసీవ్ చేసుకుని, ఫిలిప్పీన్స్‌కి చెందిన ఆర్య హబీబ్‌తో కలిసి చైనా కంపెనీలకు పంపించేవాడు. ఇలా 12 మందిని చైనా స్కామ్ కంపెనీలకు పంపాడు. ఈ కేసులో ఇప్పటికే చుక్కా రమేష్‌ను అరెస్టు చేసిన పోలీసులు పార్థసారధిపై నిఘా పెట్టారు. అతడు కంబోడియా నుంచి బ్యాంకాక్, అక్కడి నుంచి భువనేశ్వర్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడన్న సమాచారంతో అక్కడి అధికారులను అప్రమత్తం చేశారు. భువనేశ్వర్ ఎయిర్‌పోర్టు ఇమ్మిగ్రేషన్ అధికారులు బుధవారం పార్థసారధిని అడ్డుకుని, విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అతడిని అరెస్టు చేసి విశాఖ తీసుకుచ్చి, రిమాండుకు తరలించారు.

## దీపం లబ్ధిదారులకు గ్యాస్ డబ్బులు

... 5వ పేజీ తరువాయి

నాలుగో తేదీ వరకు 59,275 మందికి డెలివరీ ఇచ్చారు. మరో 70,281 మందికి సిలిండర్లు ఇవ్వాల్సి ఉంది.. అత్యధికంగా హెచ్‌పీసీఎల్ కంపెనీ..43,186 మంది సిలిండర్ బుక్ చేయగా 31,786 (73.6 శాతం) మందికి, ఆ తరువాత బీపీసీఎల్ 25,330కి గాను 14,710 (56.83 శాతం) మందికి, ఐవోసీఎల్ 35,793కు గాను 12,779 మందికి (35.7 శాతం) సిలిండర్లు డెలివరీ ఇచ్చాయి. అయితే సిలిండర్ డెలివరీ అయిన వినియోగదారులందరికీ సొమ్ములు జమ కాలేదు. సాంకేతికంగా ఇబ్బందులున్న చోట్ల పెండింగ్ చూపిస్తోంది. ఈ నేపథ్యంలో వినియోగదారుడు తమకు సిలిండర్ సరఫరా చేసే గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి ఈకేవైసీ చేసుకోవాలని డీఎస్‌వో భాస్కరరావు సూచించారు. తొలి సిలెండర్ బుక్ చేసుకునేందుకు వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు గడువు ఉందని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బహుశా రెండు, మూడు రోజుల తరువాత గ్రామ/వార్డు సచివాలయాల్లో ఈకేవైసీ సదుపాయం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.

## 'స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ ఆపాలి'

డాబాగార్డెన్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు ఎవరి దయాదాక్షిణ్యాలతో వచ్చినది కాదని, ఎంతో మంది ప్రాణత్యాగాలతో ఏర్పాటైందని సీఐటీయూ సీనియర్ నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కొనసాగిస్తున్న దీక్షల వద్దకు బుధవారం సీఐటీయూ నాయకులు విచ్చేసి సంఘీభావాన్ని ప్రకటించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా పదేళ్లుగా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వ రంగంలో కొనసాగుతున్న సంస్థలన్నీ ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం, నిజమైన దేశద్రోహం అన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, ముఠా కళాసి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## విశాఖలో ఒలింపిక్ భవన్ అవసరం: కంచరాన

విశాఖపట్నం (స్పోర్ట్సు), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడా రంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన కొత్త విధానం అద్భుతంగా ఉందని, ప్రస్తుత వర్ధమాన క్రీడాకారులతోపాటు భవిష్యత్తు తరాలను క్రీడలవైపు ఆకర్షించే విధంగా ఉందని ద ఒలింపిక్ సంఘం విశాఖ శాఖ ప్రధాన కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ హర్షం ప్రకటించారు. కొత్త విధానం ద్వారా రానున్న ఆసియా గేమ్స్, ఒలింపిక్స్, వరల్డ్ కప్, జాతీయ క్రీడల్లో పతకాలు సాధించే క్రీడాకారులను రాష్ట్రం అందించడం ఖాయమని పేర్కొన్నారు. అయితే రాష్ట్రానికి క్రీడా కేంద్రంగా రూపొందుతున్న విశాఖలో ఒలింపిక్ భవన్ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఒలింపిక్ భవన్ అందుబాటులో ఉంటే అన్ని క్రీడా సంఘాల కార్యకలాపాలకు అనుకూలంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. కోచ్‌ల కొరత వెంటాడుతోందని, వివిధ క్రీడాంశాలలో క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు అర్హత, నైపుణ్యం కలిగిన కోచ్‌లను నియమించాలని కోరారు.

## ఫిట్‌నెస్ జిమ్ సీజ్

**రెండేళ్లుగా ట్రేడ్ లైసెన్స్ చెల్లించని వైనం**

గాజువాక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ట్రేడ్ లైసెన్స్ చెల్లించని గాజువాక 60 అడుగుల రోడ్డులోని ఎస్ఎస్ ఫిట్‌నెస్ జిమ్‌ను బుధవారం జీవీఎంసీ ఏఎంహెచ్‌వో కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏఎంహెచ్‌వో మాట్లాడుతూ అందరూ ట్రేడ్ లైసెన్స్‌లను సక్రమంగా చెల్లించాలని, లేకుంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నగేశ్, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

### రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 6 ( ఆంధ్రజ్యోతి): బీహెచ్‌పీవీ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున ఈ నెల ఎనిమిదో తేదీ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ అధికారులు తెలిపారు. ఈ కారణంగా అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, మింది, చిట్టినాయుడు కాలనీ, పంతులుగారి మేడ, బీహెచ్‌పీవీ టౌన్‌షిప్, అయాన్ డిజిటల్, రామ్‌నగర్, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

### వైభవంగా గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం

అగనంపూడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి దానబోయినపాలెం, అండమాన్ కొండయ్యవలసల్లో బుధవారం గౌరీపరమేశ్వరుల అనుపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేయగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం మంగళవాయిద్యాలు, కోలాటాల నడుమ గౌరీపరమేశ్వరులను పురవీధుల్లో ఊరేగించాక నిమజ్జనం చేశారు. కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, యూత్ అసోషియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

**69వ వార్డులో ఉత్సవాలు ప్రారంభం**

**అక్కిరెడ్డిపాలెం:** గ్రేటర్ 69వ వార్డు పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో గవర గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మేళతాళాల నడుమ వరిదుబ్బు (గౌరీమాత)ను పురవీధుల్లో ఊరేగిస్తూ ఉత్సవ వేదిక వద్దకు తెచ్చారు. అనంతరం గౌరీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు జరిపారు. ఈ నెల 16 వరకు నిర్వహించే ఉత్సవాల సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు ఆళ్ల రాంప్రసాద్, పి.ఉమామహేశ్వరరావు, మళ్ల నగేశ్‌కుమార్‌లు తెలిపారు.

**పెందుర్తి మండలంలో..**

**పెందుర్తి-రూరల్:** మండలంలోని చింతల అగ్రహారం, చీమలాపల్లిలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ముందుగా మేళతాళాలు, బాణసంచా వెలుగులు, సాంస్కృతిక ప్రదర్శనల మధ్య గ్రామస్థులు ఉత్సవమూర్తులను ఊరేగించారు. అనంతరం మండపంలో ప్రతిష్ఠించారు. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

### సినిమా గైడ్

- **క:** జగదాంబ, శ్రీరామ, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** మెలోడి, శరత్,కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, సంగం, కిన్నెర, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, శ్రీకన్య (గాజువాక). తాతా (తగరపువలస)

### రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 34, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 36, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 42, బీరకాయలు 36, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 60, క్యాబేజీ 36, క్యారెట్ 68, దొండకాయలు 32, బంగాళదుంపలు 40, అరటికాయ (పెద్దది) 7, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 60, బరబాటి 40, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 40, దోసకాయలు 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 42, కీరదోస 28, క్యాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 26, కంద 72, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బూడిద గుమ్మడికాయ 30, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

**కోడిగుడ్లు (నెక్)** (వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 550 |
| విజయనగరం | 554 |
| శ్రీకాకుళం | 554 |

**చికెన్ ధరలు**

| | |
|---|---|
| బ్యాగ్ | |
| రైతు ధర | 110 |
| ఫారం ధర | 130 |
| విత్ స్కిన్ | 230 |
| స్కిన్‌లెస్ | 240 |

## ఉక్కు యాజమాన్యంతో కార్మిక సంఘాల భేటీ

**» జీతాలు చెల్లించాలని కోరిన నాయకులు**



ఉక్కు సీఎండీ చాంబర్‌లో కార్మిక సంఘాల నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంతో కార్మిక సంఘాల నాయకులు బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలను విన్నవించారు. సెప్టెంబరు నెలకు సంబంధించి ఉక్కు ఉద్యోగులకు సగం జీతమే ఇచ్చారని, మిగతా సగంతో పాటు ఈ నెల ఇప్పటివరకు జీతాలు చెల్లించలేదన్నారు. దీంతో ఉద్యోగులంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బ్లాస్ట్ ఫర్నేస్-1ను పునఃప్రారంభించినందున పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేసేందుకు తగిన ముడిసరకును సమకూర్చాలని కోరారు. బీఎఫ్ విభాగంలో ఉత్పత్తి పెంచడం జరుగుతుందని, వచ్చిన నగదు ముడిసరకు కోసం వెచ్చిస్తున్నామని, కార్మికుల జీతాలకు తొలి ప్రాధాన్యం ఇస్తామని సీఎండీ సక్సేనా తెలిపినట్టు కార్మిక నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు డి.ఆదినారాయణ, కేఎస్ఎన్ రావు, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, వరసాల శ్రీనివారావు, కొమ్మినేని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

**జీతాలు చెల్లించాలంటూ ఉక్కు ఉద్యోగుల కుటుంబ సభ్యుల ఆందోళన**

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు తక్షణమే జీతాలు చెల్లించాలని కోరుతూ ఉక్కు ఉద్యోగుల కుటుంబ సభ్యులు స్టీల్‌ప్లాంట్ స్మృత్యాంజలి పార్కు వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు




ప్లకార్డులు, బ్యానర్ ప్రదర్శిస్తున్న ఉక్కు ఉద్యోగుల కుటుంబ సభ్యులు

మాట్లాడుతూ ఉక్కు ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించకపోవడం వల్ల తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభావం పిల్లల చదువులపై కూడా పడుతుందని వాపోయారు. అందువల్ల స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం స్పందించి జీతాల చెల్లింపునకు తగిన చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల కుటుంబీకులు వేణు, నవ్య, అంబిక, భారతి, సుజాత, అనురాధ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

**'ఉక్కుపై కేంద్ర ప్రభుత్వం కుట్ర'**

స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వందలాది రోజులుగా ఉక్కు ఉద్యమం చేస్తున్నా కేంద్రంలో చలనం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంటును ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసేందుకు చూస్తుందని ఆరోపించారు. 32 మంది బలిదానాలతో ఏర్పడిన ఉక్కును కాపాడుకునేందుకు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమన్నారు.

**స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలి**

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు అన్నారు. ప్లాంటులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్ కష్టాల నుంచి లాభాల బాటలో నడవాలంటే సెయిల్‌లో విలీనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పెద్దలను కలుస్తామన్నారు. నాయకులు సింహాద్రి, నరేంద్ర, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల నియంత్రణకు విద్యార్థులు కృషి చేయాలి

**నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ**



సీపీకి జ్ఞాపిక అందజేసి సత్కరిస్తున్న దృశ్యం

అగనంపూడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నానాటికీ పెరుగుతున్న సైబర్ నేరాల నియంత్రణకు విద్యార్థులు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సూచించారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులతో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తు తం ఆన్‌లైన్ మోసాలతో పాటు సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. అందువల్ల సైబర్ నేరాల పట్ల విద్యార్థులంతా అవగాహన కలిగి ఉండ డంతో పాటు వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులకు వివరించా లన్నారు. టెక్నాలజీ ద్వారా సైబర్ నేరాలకు దుండగులు పాల్పడుతున్నారని, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇతర యాప్‌ల లింక్‌లతో పాటు ఈ-మెయి ల్స్‌తో హ్యాకర్లు మోసాలకు పాల్పడుతున్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా తక్షణమే 100 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. అనంతరం విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు శంఖబ్రత బాగ్చీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ మధుసూదనరావు, సింబియోసిస్ టెక్నాలజీ సీఈవో నరేశ్‌కుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### క్రీడాకారులకు కిట్లు పంపిణీ

కూర్మన్నపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 9,10, 11 తేదీల్లో 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 బాల బాలికల నెట్‌బాల్ పోటీలు జరగనున్న నేపథ్యంలో కణితి హైస్కూలు క్రీడాకారులకు బుధవారం స్పోర్ట్స్ కిట్లను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి క్రీడల్లో విద్యార్థులు విజేతలుగా నిలిచి పాఠశాలతో పాటు ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జాతీయ క్రీడాకారులుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వి.వెంకటరమణ, ప్రధానోపాధ్యాయుడు బి.సూర్యప్రకాశ్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.మన్నాజీ, నారాయణరావు, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

### కనీస పెన్షన్ రూ.9 వేలుగా ప్రకటించాలి

పెదగంట్యాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేసి పదవీ విరమణ చేసిన వారికి కనీస పెన్షన్ కింద తొమ్మిది వేల రూపాయలను చెల్లించేలా ప్రకటన చేయాలని పారిశ్రామిక ప్రాంత పెన్షనర్స్ అసోసియేషన్ తీర్మానించింది. ఇందుకు సంబంధించిన తీర్మాన ప్రతిని కేంద్ర ప్రభుత్వానికి పంపాలని నిర్ణయించింది. పారిశ్రామిక ప్రాంత పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశం బుధవారం పెదగంట్యాడ కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్‌లో జరిగింది.

ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన అసోసియేషన్ పెదగంట్యాడ శాఖ అధ్యక్షుడు కణితి అప్పలరాజు మాట్లాడుతూ రిటైర్డ్ పర్సన్స్ అందరినీ పేద వర్గాలుగా గుర్తించి వారికి రాష్ట్ర ప్రభుత్వం తెలుపు రేషన్ కార్డులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం రైల్వే చార్జీల్లో 50 శాతం రాయితీ ఇవ్వాలన్నారు. పెన్షనర్ దంపతులకు ఉచిత మెడికల్ సౌకర్యం కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ సమావేశంలో పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు నమ్మి అప్పలనాయుడు, బి.గురప్ప, కె పెంటారావు, ఎన్‌వీ రమణ, నమ్మి అప్పారావు, తదితులు పాల్గొన్నారు.

## కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

**రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**



పల్లా శ్రీనివాసరావును సత్కరిస్తున్న నాయకులు

ఆటోనగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 70వ వార్డు చట్టివానిపాలెంలో బుధవారం నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ కార్యకర్తల పార్టీ అని, సభ్యత్వ నమోదుతో కార్యకర్తతో పాటు కుటుంబానికి ప్రమాద భీమా రూ.రెండు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకు భరోసాగా ఉంటుందన్నారు. అనంతరం పల్లాను పలువురు నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జి చట్టి గోపి, అధ్యక్షుడు కేవీఎస్ శంకరరావు, నాయకులు బొడ్డేడ రమణ, ఆర్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

**టీడీపీ సభ్యత్వంతో గౌరవం**

**కూర్మన్నపాలెం:** టీడీపీ సభ్యత్వంతో అందరికీ సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు అన్నారు. వడ్లపూడిలో నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ సభ్యత్వ నమోదును అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్‌రాజు, శ్రీనివాస వర్మ, జి.రాము, మాటూరు రాము, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### ఆటోనగర్‌లో ఏపీటీపీసీ చైర్మన్ పర్యటన



గొడౌన్‌లోని సామగ్రిని పరిశీలిస్తున్న చైర్మన్ బాబూరావు

ఆటోనగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లో బుధవారం ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ) చైర్మన్ సి.వజ్జా బాబూరావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్‌కు సంబంధించి యాదవ జగ్గరాజుపేట వద్ద రెండుచోట్ల వేర్ హౌసింగ్ గొడౌన్లు ఉన్నాయన్నారు. అలాగే రేసుపువానిపాలెం, ఎండాడ, బీచ్ రోడ్డులో కార్పొరేషన్‌కు చెందిన ఆస్తులున్నాయని, అక్కడ ఏఏ పనులు నిర్వహిస్తున్నారో తెలుసుకునేందుకు తాను వచ్చానన్నారు. ఏపీటీపీసీ ద్వారా ట్రేడింగ్, ఉపాధి కల్పన వంటి వాటిపై నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. పోర్టులు, కారిడార్లతో విశాఖ నగరాభివృద్ధి మరింతగా జరగనున్నదని, భవిష్యత్తులో కార్పొరేషన్ ద్వారా చేపట్టే అభివృద్ధి పనులపై దృష్టి సారిస్తామని బాబూరావు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయమన్నారు. ఆయన వెంట ఏపీటీపీసీ జీఎం హనుమాన్ నాయక్, జనశిక్షణ సంస్థ విశాఖ చైర్మన్ రామరాజు, రామచంద్రరావు, రాము, భాస్కరరావు, శ్రీరామ్, తదితరులు ఉన్నారు.

### ఖోఖో పోటీల విజేతకు అభినందనలు



ట్రోఫీతో హేమలత

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో గత వారం జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 ఖోఖో పోటీల్లో అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థిని బి.హేమలత ఉత్తమ ప్రతిభ చూపి విశాఖ జట్టు విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించినట్టు హెచ్ఎం ఎంఎల్ఎస్ కాంతం తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం హేమలతను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు, స్కూల్ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు అభినందించారు.

### బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

అగనంపూడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి అట్టవానిపాలెం వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో కుశాల్ ప్రాజెక్టు సౌజన్యంతో బుధవారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. బాల్య వివాహాలకు ఎవరైనా, ఎక్కడైనా పాల్పడితే 1098 హెల్ప్ లైన్ నంబరుకు ఫోన్ చేయాలని కోరారు. అనంతరం మహిళా మండలి ప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి కో-ఆర్డినేటర్ అను శ్రావణి, అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

### స్ఫటిక శివలింగానికి ఐలా కమిషనర్ పూజలు

ఆటోనగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 71వ వార్డు పరిధి ఆటోనగర్‌లోని దుర్గామల్లికార్జున స్వామివారి స్ఫటిక లింగానికి అర్చకులు తరుణ్ కుమార్ శర్మ పర్యవేక్షణలో, ఐలా కమిషనర్ ఎ.కిశోర్, కోశాధికారి పి.పద్మావతి, పారిశ్రామికవేత్త, ఆలయ ఉపాధ్యక్షుడు లంక బాపిరాజు, తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎ.సత్యన్నారాయణ, సభ్యుడు డీఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



పూజలందుకున్న స్వామివారు

### ముగిసిన తిరు నక్షత్ర పూజలు

సింహాచలం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విశిష్టాద్వైత మతవ్యాపకులు మనవాళ మహామునుల తిరునక్షత్ర పూజలు బుధవారం జరిగిన చాత్తుతో పరిసమాప్తమయ్యాయి. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనల తరువాత బాల భోగనివేదన జరిపారు. ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని ఉభయదేవేరులు, ఆళ్వార్ల మూర్తులను ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. లోకకల్యాణార్థం అన్న సంకల్పంతో షోడశోప చారాలు సమర్పించారు. అనంతరం నాలుగు రోజులుగా సాగుతున్న నాలాయిర దివ్య ప్రబంధంలోని మిగిలిన పాశురాలను ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ సారధ్యంలో వైదికులు పారాయణలు పూర్తిచేశారు. మధ్యాహ్నం రాజబోగ నివేదన సమయంలో పూజలు చేసి తీర్థగోష్టి జరిపి ప్రసాద వితరణ చేయడంతో తిరు నక్షత్ర పూజలు పూర్తయ్యాయి.

### జోన్ 8 ఏసీపీని కలిసిన బిల్డర్స్ అసోసియేషన్

వేపగుంట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వేపగుంట జోనల్ కార్యాలయం ఏసీపీ రామలింగేశ్వరరెడ్డిని జోన్ 8 బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామరాజు, కార్యదర్శి లక్కి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్, ఈసీ ప్రతినిధులు రమణయ్య, వెంకటరమణ, ఆదిత్యానాయుడు, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

### దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

పెదగంట్యాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వవార్డు గోపాల్‌రెడ్డి నగర్‌లో దుర్గాదేవి ఆలయ 21వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారికి అభిషేకాలు, కుంకుమపూజలు జరిపికార్పొరేటర్ గంధం శ్రీనివాసరావుతో పాటు గోపాల్‌రెడ్డినగర్, బర్మాకాలనీ, డెయిరీ కాలనీలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్న సమారాధనను చేపట్టారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

**పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు**



కంచరపాలెం : వృద్ధుడి సమస్య వింటున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. బుధవారం ఆయన 58వ వార్డు శ్రీహరిపురంలో జీవీఎంసీ అధికారులతో కలిసి ప్రజా దర్బర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అధికారులు, కూటమి నాయకులు దృష్టిసారించాలని చెప్పారు. తన దృష్టికి ఎక్కువగా పింఛన్లు, రేషన్ కార్డులు, టిడ్కో ఇళ్లు, స్థలాలకు సంబంధించిన వినతులు వస్తున్నాయని, వాటిని పరిశీలించి దశల వారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ 5 కమిషనర్ రాము, ములగాడ తహసీల్దార్ భుజంగరావు, అంగ దుర్గా ప్రశాంతి, మల్కాపురం ఎస్ఐ శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, వార్డు టీడీపీ అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పొత్తబత్తుల శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు రామ్మోహన్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గవర కంచరపాలెంలో ఎమ్మెల్యే గణబాబు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేయాలని, పన్నుల్లో మార్పులు, సామాజిక పింఛన్ల మంజూరు, ఇళ్ల స్థలాల కేటాయింపు తదితర సమస్యలను స్థానికులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాజశేఖర్, తహసీల్దార్ రమేశ్, ఐదో జోన్ జడ్సీ రాము, తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి వెంకటాద్రిపై పవిత్రోత్సవాలు

పెందుర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి వెంకటాద్రి శిఖరంపై ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 7 నుంచి 11 వరకు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఈమేరకు కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

### రాంపురంలో గ్రామసభ



మాట్లాడుతున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

పెందుర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని రాంపురంలో బుధవారం భూముల రీసర్వేకు సంబంధించి గ్రామసభ జరిగింది. తహసీల్దార్ ఆనంద్‌కుమార్ రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు, డీటీ చంద్రశేఖర్, సర్వేయర్ శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

### వుడా కాలనీలో రక్తదాన శిబిరం

ఎన్ఏడీ జంక్షన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో టీడీపీ నాయకుడు రాపేటి వాసు జన్మదినం పురస్కరించుకొని రోటరీ క్లబ్ సహకారంతో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన నాయకులను అభినందించారు. రక్తదానం ద్వారా చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు ఆపదలో ఉన్న వారిని ఆదుకొనే గొప్ప అవకాశం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వాసుదేవరావు, కమాండర్ మూర్తి, రాజు తదితరులు పాల్గొన్నారు.

### సింహగిరిపై నిబంధనలకు వ్యతిరేకంగా కారు పార్కింగ్



ప్రధాన రాజగోపురం వద్ద నిలిపిన కారు

సింహాచలం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులు తమ వాహనాలను నిర్దిష్ట స్థలాల్లో పార్క్ చేయాలని ఈవో ఆదేశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు, మంత్రి నారా లోకేశ్ తదితర ప్రముఖులు తమ వాహనాలను దేవస్థానం నిర్ణయించిన పార్కింగ్ స్థలంలో ఉంచి స్వామి దర్శనానికి నడిచివచ్చారు. కానీ కొందరు ఆల య సిబ్బంది ఇష్టానుసారం తమ వాహనాలనే కాకుండా పరిచయం ఉన్న వారి వాహనాలను ప్రధాన రాజగోపురానికి చేరువగా పార్క్ చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం కొత్తకారు కొన్న భక్తుడు వాహన పూజకు గోకులం వద్దకు తేవాల్సి ఉండగా ప్రధాన రాజగోపురం వద్ద నున్న లిఫ్టువరకు తెచ్చి పార్క్ చేశా డు. అయినా విధుల్లోని గార్డులు ప్రశ్నించకపోవడంపై భక్తులు మండిపడుతున్నారు. ఈ వ్యవహారంలో ఈవో తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### మల్కాపురం పీఎస్‌లో సాంకేతిక ఇబ్బందులు

మల్కాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మల్కాపురం పోలీస్ స్టేషన్‌కు ఐదు రోజులుగా నెట్‌వర్క్ సమస్య ఉంది. దీంతో స్టేషన్‌కు సంబంధించిన రికార్డుల అప్‌లోడింగ్‌లో ఇబ్బందులు తలెత్తున్నాయి. ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాల్సి వస్తే, సిబ్బంది తమ సెల్‌ఫోన్ నెట్ వాడుతున్నారు. ఈ స్టేషన్‌లో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ వాడుతున్నారు. స్టేషన్‌కు కేవలం అయిదు అడుగుల దూరంలోనే బీఎస్ఎల్ఎన్ కార్యాలయం ఉంది. పోలీసులు బీఎస్ఎన్ఎల్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా.. ఎవరూ స్పందించడం లేదు.

### వృధాగా తాగునీరు



రోడ్డుపై నిలిచిన నీరు, పంప్‌హౌస్ నుంచి వృథావుతున్న నీరు

మల్కాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మల్కాపురం పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న జీవీఎంసీ పంప్‌హౌస్ నుంచి తాగునీరు వృథాగాపోతోంది. పంప్‌హౌస్ ఓవర్ ఫ్లో కావడం, సాంకేతికపరమైన ఇబ్బందుల వల్ల కొంత నీరు బయటకు వస్తోంది. ప్రతిరోజూ వేకువజామున 4 గంటల సమయంలో ఇదే పరిస్థితి ఉంటోంది. పంపింగ్ జరిగే సమయంలో సిబ్బంది అక్కడ ఉండాలి. కానీ ఎవరూ ఉండడం లేదు. దీంతో రోడ్డు మీద అర కిలోమీటరు వరకూ నీరు పారుతుండడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

### విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు

వేపగుంట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నాయుడుతోట



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆవరణలో విద్యార్థులకు బుధవారం చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ఆస్పత్రిలో జరుగుతున్న బాలల వారో త్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నగరంలోని 22 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ముందుగా వారికి వైద్యులు నేత్ర సమస్యల గురించి అవగాహన కల్పించారు. అనంతరం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీఎం కె. రాధాకృష్ణన్, శంకర్ ఫౌండేషన్ డీజీఎం రమేశ్ కుమార్, బంగార్రాజు, రజనీ, లలిత పాల్గొన్నారు.

## 18 కిలోల గంజాయి పట్టివేత

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఒడిశాకు చెందిన బల్లా అన్నాజీ అనే నిందితుడ్ని ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు పట్టుకున్నారు. అతని నుంచి రూ.90 వేలు విలువ చేసే 18 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పాడేరు నుంచి విశాఖ మీదుగా ముంబైకి రవాణా చేస్తుండగా నిందితుడు తమకు చిక్కాడని జీఆర్పీ పోలీసులు తెలిపారు. సబ్ ఇన్‌స్పెక్టర్ రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## 'విద్యుత్ ట్రూఅప్ చార్జీలు రద్దుచేయాలి'

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రూఅప్, ప్యూయల్ సర్దుబాటు చార్జీలు రద్దుచేయాలని విశాఖపట్నం అపార్ట్‌మెంట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, గ్రేటర్ విశాఖ రెసిడెంట్ కాలనీ ఫెడరేషన్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కోరాయి. ఈ మేరకు ప్రధాన కార్యదర్శులు బీబీ గణేష్, పిట్టా నారాయణమూర్తి వినతిపత్రాన్ని పంపారు. ప్రజలపై రూ.14వేల కోట్ల చార్జీలు బాదడానికి విద్యుత్ సంస్థలు సిద్ధమయ్యాయన్నారు. దీనివల ఆర్థికంగా కుదేలవుతారన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు.

## 15న తీరంలో యదు మేళా

మహారాణిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి రోజున సాగర తీరం గోకుల్ పార్కు వద్ద శ్రీ రాధాకృష్ణ మహోత్సవ యదుమేళా నిర్వహించనున్నట్టు జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. సంఘం గౌరవాధ్యక్షుడు పల్లా సింహాచలం సూచనల మేరకు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, మేయర్ హరివెంకటకుమారి పర్యవేక్షణలో వేడుక జరుగుతుందన్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు సంద్రానికి పాలు, పెరుగు సమర్పణ, సముద్ర స్నానాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.





# అవగాహనతోనే రక్షణ!

## కేన్సర్ గుర్తింపులో పరీక్షలు కీలకం



- సకాలంలో గుర్తిస్తేనే ప్రాణాలకు భరోసా
- మూడు, నాలుగు దశల్లో తప్పని ప్రాణాపాయం
- దేశంలో ఏటా 1.1 మిలియన్ కేసులు నమోదు

### నేడు జాతీయ కేన్సర్ అవగాహన దినం

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):

**కేన్సర్ విజృంభిస్తోంది. ఏటా దేశంలో లక్షలాది మంది వ్యాధి బారినపడుతున్నారు. అదే స్థాయిలో మరణాలూ సంభవిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం వ్యాధి పట్ల అవగాహన లేకపోవడమేనని నిపుణులు చెబుతున్నారు. వ్యాధి ముదిరిన తరువాత ఆస్పత్రులకు రావడంతో ప్రాణాలను కాపాడే పరిస్థితి లేకుండా పోతోందని చెబుతున్నారు. ప్రాథమిక దశలో కేన్సర్‌ను గుర్తిస్తే సాధారణ జీవితం గడిచే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు. మూడు, నాలుగు దశల్లో వస్తే జీవితకాలాన్ని కొంతవరకు పెంచగలమని, ప్రాణాలను కాపాడలేమంటున్నారు. ప్రజల్లో కేన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏటా అక్టోబరు ఏడో తేదీన జాతీయ కేన్సర్ అవగాహన దినంగా నిర్వహిస్తున్నారు.**

దేశంలో ఏటా కేన్సర్ బారినపడుతున్న వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. గతంలో 50 ఏళ్లు దాటిన వారిలో మాత్రమే ఈ వ్యాధి కనిపించగా, ఇటీవల 40 ఏళ్లు దాటిన వారిలోనూ గుర్తిస్తున్నారు. కేన్సర్‌కు అనేక అంశాలు కారణమవుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. దేశంలో ఏటా 1.1మిలియన్ కొత్త కేన్సర్ కేసులు నమోదవుతుండగా, అందులో సుమారు ఐదు లక్షల మంది మృత్యువాత పడుతున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వ్యాధి పట్ల అవగాహన లేకపోవడమే దీనికి కారణమని తేల్చారు.

#### తొలిదశలో గుర్తిస్తే 98 శాతం నయం

ఏ కేన్సర్ అయినా తొలిదశలో గుర్తిస్తే 98 శాతం ప్రాణాలు కాపాడే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. లక్షణాలు కనిపించకుండానే స్ర్కీనింగ్ పరీక్షల్లో కేన్సర్ కణాలను గుర్తించే అవకాశం ఉంది. దీనిని జీరో స్టేజ్‌గా చెబుతారు. ఈ దశలో వ్యాధిని గుర్తిస్తే 99 శాతం వరకు ప్రాణాలను కాపాడవచ్చు. కొన్ని కేసులను ప్రాథమిక దశలో గుర్తించవచ్చు. ఈ దశలో మెరుగైన చికిత్స తీసుకుంటే 95 నుంచి 98 శాతం ప్రాణాలు కాపాడవచ్చు. రెండో దశలో గుర్తిస్తే 70 శాతం, మూడో దశలో గుర్తిస్తే 50 శాతం మాత్రమే ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుంది. నాలుగో దశలో గుర్తిస్తే పది శాతం కంటే తక్కువ మందిని ఐదేళ్లపాటు జీవించేలా చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు.

#### ఇదీ ఉద్దేశం...

వ్యాధి పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, కేన్సర్ పరీక్షలు చేయించుకునేందుకు ముందుకు వచ్చేలా చేసే ఉద్దేశంతో జాతీయ కేన్సర్ అవగాహన దినం నిర్వహిస్తున్నారు. సమయానికి వ్యాధిని గుర్తించడం, నిర్ధారించే పరీక్షలు చేయడం, మెరుగైన వైద్య సేవలు అందించడమే దీని ప్రధాన లక్ష్యం. ఇందుకోసం వివిధ స్వచ్ఛంద సంస్థలు, వైద్యసేవలు అందించే ఆస్పత్రులు, ఇతర ఆర్గనైజేషన్స్‌తో కలిసి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వాక్‌థాన్, ర్యాలీలు, అవగాహన సదస్సులు చేపడుతున్నారు.

#### గుర్తించడమే చికిత్సలో కీలకం..

కేన్సర్ అనగానే చాలా మంది భయపడుతుంటారు. నిర్ధారణ పరీక్షలు చేయించుకునేందుకు ముందుకురారు. ఇది ప్రమాదకరమని నిపుణులు చెబుతున్నారు. కొన్ని లక్షణాలను బట్టి అనుమానాలను వ్యక్తం చేయాలి. వైద్యుల సూచనల మేరకు పరీక్షలు చేయించుకుంటే వ్యాధిని ముందుగానే గుర్తించే వీలుంటుంది. చాలా మంది వైద్యులు సూచనలు పట్టించుకోవడం లేదు.

అలాగే రొమ్ము, సర్వైకల్ కేన్సర్‌ను నిర్ధారించే పరీక్షలను 40 ఏళ్లు దాటిన మహిళలు లక్షణాలతో సంబంధం లేకుండా ఏడాదికి ఒకసారి చేయించుకుంటే మెరుగైన ఫలితం ఉంటుంది. ఒకవేళ కేన్సర్ కారక కణాలుంటే వేగంగా గుర్తించి, చికిత్స అందించే అవకాశం ఉంటుంది. కేన్సర్‌తో బాధపడేవారిలో సుమారు 90 శాతం మంది మూడు, నాలుగు దశల్లోనే వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు.

#### పరీక్షలంటేనే భయపడుతున్నారు

కేజీహెచ్‌లో డిజిటల్ మామోగ్రఫీ పరికరంతో రొమ్ము కేన్సర్‌ను అడ్వాన్స్‌డ్ స్టేజ్‌లో నిర్ధారించే అవకాశం ఉంది. ఈ పరీక్షకు బయట రూ.4 వేల వరకు అవుతుంది. ఇక్కడ ఓపీ టికెట్ లేకుండా ఉచితంగా చేస్తున్నాం. గైనకాలజీ వైద్యులు సూచిస్తున్నా చాలామంది ముందుకు రావడంలేదు. ప్రతిరోజూ ఐదుగురు మాత్రమే వస్తున్నారు. రోజూ 30 మందికి పరీక్షలు చేసే సామర్థ్యం ఉంది. ఎటువంటి లక్షణాలు లేని సమయంలోనే పరీక్ష చేయించుకుంటే వ్యాధిని గుర్తించే అవకాశం ఉంది. చాలా మంది రొమ్ములో కణితులు ఏర్పడినప్పుడు, రక్తం, చీము కారినప్పుడు వస్తున్నారు. అప్పటికే వ్యాధి మూడు, నాలుగు దశల్లోకి వెళ్లిపోతోంది. ఇది అత్యంత ప్రమాకరం. మిగిలిన కేన్సర్లకు స్ర్కీనింగ్స్ అందుబాటులో ఉన్నాయి.



\- డాక్టర్ బుజ్జిబాబు, రేడియాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

#### అపోహలతోనే ప్రమాదం



కేన్సర్ స్ర్కీనింగ్ చేయించుకునేందుకు చాలామంది భయపడుతుంటారు. శరీరం లో కేన్సర్ కణాలు ఉంటేనే బయటపడుతుంది. అపోహలు వీడితే మేలు. కేజీహెచ్‌లో సర్వైకల్ కేన్సర్ స్ర్కీనింగ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నాం. ప్రతిరోజూ 20 మందికి ఉచితంగా స్ర్కీనింగ్ చేస్తున్నాం. 1.47 శాతం మందికి మాత్రమే తదుపరి దశ పరీక్షలు చేయించాల్సి వస్తోంది. ఒకటికి రెండుసార్లు కౌన్సెలింగ్ ఇస్తేనే మహిళలు ముందుకువస్తున్నారు. రీ ప్రొడక్టివ్ ఏజ్ గ్రూప్ వారికి పరీక్ష చేయవచ్చు. దీనివల్ల మేలు జరుగుతుంది. కేన్సర్లను సకాలంలో గుర్తిస్తే మెరుగైన వైద్య సేవలు అందించవచ్చు.

\- డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి, గైనకాలజీ విభాగాధిపతి, కేజీహెచ్



సత్యనారాయణ భౌతికకాయం వద్ద గౌరవ వందనం చేస్తున్న పోలీసులు



నివాళులర్పిస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా

# రెడ్డి మాస్టారుకు కన్నీటి వీడ్కోలు

**అధికార లాంఛనాలతో పెదగోగాడలో అంత్యక్రియలు**

**ఘన నివాళులర్పించిన టీడీపీ నాయకులు**

చోడవరం/ చీడికాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ భౌతికకాయానికి బుధవారం ఆయన స్వగ్రామం చీడికాడ మండలం పెదగోగాడలో అంత్యక్రియలు నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో అధికార లాంఛనాలతో అంతిమ సంస్కారం జరిపారు. అంతకుముందు సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు అనకాపల్లి డీఎస్పీ మల్లంపాటి శ్రావణి, నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పెదగోగాడ చేరుకుని రెడ్డి సత్యనారాయణ భౌతికకాయానికి నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వ రరావు, తదితరులు తెలుగుదేశం పార్టీ పతాకాన్ని భౌతికకాయంపై ఉంచి నివాళులు అర్పించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామమూర్తి నివాళులర్పించారు.

పోలీసులు గౌరవ సూచికంగా గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి, తుపాకులను అవనతం చేశారు. అనంతరం భౌతికకాయాన్ని శ్మశానవాటికకు తరలించారు. సత్యనారాయణ కుమారుడు రాము చితికి నిప్పంటించారు. అభిమాన నేతను కడసారి చూసేందుకు పలు గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు బంధువులు తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు.

# ఏయూ పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశానికి విస్తృత ఏర్పాట్లు

- వర్చువల్ సమావేశంలో సూచనలిచ్చిన జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థుల వార్షిక సమావేశం-2024 నిర్వహణకు సంబంధించిన అంశాలపై బుధవారం వర్చువల్ సమావేశం జరిగింది. ఇందులో ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గ్రంధి మల్లికార్జునరావు పాల్గొని అధికారులకు సూచనలిచ్చారు. బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో డిసెంబరు ఏడో తేదీన సమావేశాన్ని నిర్వహించనున్నారు. అలూమ్నీ అసోసియేషన్ సభ్యుల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్టు వీసీ శశిభూషణరావు వివరించారు. పూర్వ విద్యార్థులందరినీ ఆహ్వానించాలని, దీనికి విస్తృత ప్రచారం చేయాలని జీఎంఆర్ అలూమ్నీ ప్రెసిడెంట్ డాక్టర్ శంకరరావుకు సూచించారు. సమావేశంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎస్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, అలూమ్ని అసోసియేషన్ వైస్ చైర్మన్ డాక్టర్ కె.కుమార్ రాజా, జాయింట్ సెక్రటరీ ఆకుల చంద్రశేఖర్, సభ్యులు డాక్టర్ ఎస్కేతఃఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఏయూ వీసీ శశిభూషణరావు, అధికారులు (ఇన్‌సెట్లో) వర్చువల్‌గా మాట్లాడుతున్న గ్రంధి మల్లికార్జునరావు

# నేటి నుంచి ఇసికాన్ వార్షిక సదస్సు

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇసికాన్ (ఎండో క్రైన్ సొసైటీ ఆఫ్ ఇండియా) 53వ వార్షిక సదస్సు గురువారం నుంచి పదో తేదీ వరకు నోవాటెల్ లో నిర్వహిస్తున్నట్టు సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ కె.దిలీప్‌కుమార్ తెలిపారు. కేజీహెచ్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతూ 1971లో ఎండోక్రైన్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేశామని, ఏటా సదస్సు నిర్వహించి దేశ, విదేశాల్లో అధునాతన వైద్య పద్ధ తులపై చర్చిస్తామన్నారు. విశాఖలో తొలిసారి సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. షుగర్, థైరాయిడ్, మెడ వద్ద వాపు, లింగధారణ వ్యాధులు, ఎముకల క్షీణతకు ఆధునిక వైద్య పద్ధతులపై చర్చిస్తామన్నారు. వివిధ విదేశాల నుంచి 500 మంది వైద్యులు హాజరవుతా రన్నారు కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కేపీవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు 8న సాయంత్రం 6.30 గంటలకు సదస్సును ప్రారంభిస్తారన్నారు. యువ వైద్యులకు ఈ సదస్సు గొప్ప అవకాశంగా నిలుస్తుందన్నారు. అమెరికా, దుబాయ్, ఇంగ్లాండ్ తదితర దేశాలకు చెందిన అనేకమంది ప్రముఖ వైద్యులు సదస్సుకు హాజరవుతున్నట్టు తెలి పారు. 9న ఉదయం ఆరు గంటలకు బీచ్ రోడ్డులో వాక్‌థాన్ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో డాక్టర్ మైథిలి, వైద్యులు పాల్గొన్నారు.





సదస్సు వివరాలను వెల్లడిస్తున్న వైద్యులు

# బాలుడి ఆత్మహత్య

**పాఠశాలకు వెళ్లలేదని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం**



మనోహర్‌కుమార్ (ఫైల్)

గోపాలపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారని మనస్తాపానికి గురైన బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం చంద్రనగర్‌లో జరిగింది. పోలీసులు, మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు... దువ్వాడ సెజ్‌లోని ఓ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న తోరణం ఈశ్వరరావు, భార్య గౌరి ఇద్దరు కుమారులతో పాటు చంద్రనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నాడు. ఈశ్వరరావు భార్య గౌరి ఎన్ఏడీ జంక్షన్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తోంది. పెద్ద కుమారుడు ఇంటర్, చిన్న కుమారుడు ఏడో తరగతి చదువుతున్నారు. చిన్నకుమారుడు మనోహర్‌కుమార్ (12) వారం రోజులుగా పాఠశాలకు వెళ్లడం లేదు. దీంతో తల్లిదండ్రులు మందలించారు. బుధవారం ఉదయం 8 గంటలకు ఈశ్వరరావు భార్య, పెద్దకుమారుడిని కళాశాల వద్ద దింపడానికి వెళ్లి, తిరిగి 9 గంటలకు వచ్చాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా మనోహర్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. వెంటనే 108 వాహనానికి సమచారం అందించడంతో సిబ్బంది బాలుడ్ని పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. గోపాలపట్నం సీఐ కె.సతీశ్ మృతదేహాన్ని పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆటో బోల్తా: 11 మందికి గాయాలు

జగదాంబ కూడలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ కొండగుడి కన్నెమరియ ఘాట్ రోడ్డులో బుధవారం ఆటో బోల్తా పడడంతో 11 మందికి స్వల్పగాయాలయ్యాయి. హార్బర్ ఎస్ఐ మోహనరావు తెలిపిన వివరాల మేరకు ...విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం రంగరాయపురానికి చెందిన ఆటో డ్రైవర్ ఎల్.గౌతంరాజు (35) మరో 11 మంది కుటుంబసభ్యులతో కలిసి బుధవారం కొండగుడి కన్నె మరియమ్మను దర్శించుకునేందుకు వచ్చారు. తిరిగి వస్తుండగా బ్రేకులు పనిచేయకపోవడంతో ఆటోను డివైడర్‌కు ఢీకొట్టించి ఆపే ప్రయత్నం చేశాడు. దీంతో ఒక్కసారిగా 11 మంది ప్రయాణికులు చెల్లాచెదురుగా రోడ్డుపై పడిపోయారు. సమాచారం అందుకున్న హార్బర్ పోలీసులు క్షతగాత్రులను కేజీహెచ్‌కు తరలించారు. వీరిలో పరదేశి తలకు తీవ్రగాయమయింది. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద పర్యవేక్షణలో క్షతగాత్రులకు వైద్య సేవలందిస్తున్నారు. గాయపడిన వారిలో ఇద్దరు మహిళలు, బాలిక, బాలుడు, 35 ఏళ్లలోపు ఏడుగురు పురుషులున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రెండు బైక్‌లు దగ్ధం



కాలిపోయిన వాహనాలు పరిశీలిస్తున్న సీఐ

అగనంపూడి, నవంబరు 6: స్థానిక కొండయ్యవలసలో రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు కొండయ్యవలసలో స్టీల్‌ప్లాంట్ రిటైర్డు ఉద్యోగి బలిరెడ్డి రామారావు కుటుంబ సభ్యులు ఇంటి ముందు బుల్లెట్‌తో పాటు స్కూటీని పార్కు చేశారు. మంగళవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో వాహనాలకు ఎవరో నిప్పు పెట్టడంతో కాలి బుడిదయ్యాయి. స్థానికులు కేకలు వేయడంతో కుటుంబసభ్యులు బయటకు వచ్చారు. దువ్వాడ ఎస్ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'నగరాల్లో సుస్థిర జీవనానికి టౌన్‌ప్లానింగ్ కీలకం'

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరాలు, పట్టణాల్లో ప్రజల సుస్థిర జీవనానికి టౌన్‌ప్లానింగ్ విభాగం పాత్ర కీలకమని టౌన్‌ప్లానింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల ఎనిమిదిన ప్రపంచ టౌన్‌ప్లానింగ్ దినోత్సవం సందర్భంగా జీవీఎంసీతో పాటు వీఎంఆర్‌డీఏలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

